www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా...
గురువారం 04 - 9 - 2025 సంపుటి : 1 సంచిక : 57 పేజీలు : 12 వెల : 5/- తెలంగాణ/ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ CMD

# నాన్నా, మీ చుట్టూ ఏం జరుగుతోందో చూసుకోండి



**నేను, నాన్న, అన్న కలిసి ఉండటం చాలా మందికి ఇష్టం లేదు - మా కుటుంబం బాగుండొద్దు..**
**మేం విచ్ఛిన్నమైతేనే వాళ్లకు అధికారం వస్తుంది - దీనిలో భాగంగా మొదటిగా నన్ను బయటకు పంపించారు**
**- ఇదే ప్రమాదం రామన్నకు, మీకూ పొంచి ఉంది - గతేడాది నవంబర్ 23 నుంచి ప్రజాక్షేత్రంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టా**
**గులాబీ కండువాలతో అనేక ప్రజాసమస్యలపై మాట్లాడా - అవన్నీ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు ఎలా అవుతాయి**
**ఈ అంశంపై భారత రాష్ట్ర సమితి పెద్దలు పునరాలోచన చేయాలి - హరీశ్‌రావు, సంతోష్ ఇళ్లల్లో బంగారం**
**ఉంటే బంగారు తెలంగాణ అవుతుందా? - అవినీతి వల్లే కేసీఆర్‌కు సీబీఐ మరక అంటింది**
**హరీశ్‌రావు కారణంగానే ఈటల , జగ్గారెడ్డి పార్టీ నుంచి బయటకు వెళ్లారు - కేసీఆర్ వెంట నీడలా ఉండే సంతోష్‌కు**
**ధనదాహం ఎక్కువ - ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు - ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన**

## నా రాజీనామాను ఆమోదించాలి..గుత్తా సుఖేందర్ రెడ్డికి కల్వకుంట్ల కవిత ఫోన్..

విశ్వంభర, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితిలోని కొందరు తనపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌ను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. భారత రాష్ట్ర సమితి నుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో కవిత మీడియా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మాట్లాడారు. భారత రాష్ట్ర సమితి ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఈ సందర్భంగా కవిత ప్రకటించారు.

పార్టీలో ఉంటూ కేవలం డబ్బు సంపాదించుకోవాలనే ఆలోచన ఉన్నవాళ్లు, వ్యక్తిగత లబ్ధి పొందాలనుకునే వాళ్లు మేం ముగ్గురం కలిసి ఉండకూడదని ఇలా కుట్రలు చేశారని కవిత ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. "మా కుటుంబం బాగుండొద్దు.. మేం విచ్ఛిన్నమైతేనే వాళ్లకు అధికారం వస్తుంది. నేను, నాన్న, అన్న కలిసి ఉండటం చాలా మందికి ఇష్టం లేదు. దీనిలో భాగంగా మొదటిగా నన్ను బయటకు పంపించారు. అదిక్కడితో ఆగదు. నాన్నా.. మీ చుట్టూ ఏం జరుగుతుందో ఓసారి చూసుకోండి. రేపటి నాడు ఇదే ప్రమాదం రామన్న (కేటీఆర్)కు, మీకూ పొంచి ఉంది. భారత రాష్ట్ర సమితిని హస్తగతం చేసుకునే కుట్రలోనే నన్ను బయటకు పంపించారు" అని కవిత వ్యాఖ్యానించారు.

### అవన్నీ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలా?

'అక్రమ కేసులు పెట్టి తిహాడ్ జైలులో ఐదున్నర నెలలు ఉండి వచ్చాక గతేడాది నవంబర్ 23 నుంచి ప్రజాక్షేత్రంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టానని కవిత తెలిపారు. గురుకులాలు, బీసీ రిజర్వేషన్లు, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం అందించాలని పోస్ట్ కార్డు ఉద్యమం చేశామన్నారు. తెలంగాణ తల్లి స్వరూపాన్ని మార్చినపుడు గళమెత్తినట్లు చెప్పారు. బనకచర్ల, భద్రాచలం సమీపంలోని ముంపు గ్రామాల అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించినట్లు కవిత తెలిపారు. సీఎం సొంత జిల్లాలో భూనిర్వాసితులకు అండగా ఉన్నామని చెప్పారు. 47 నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలను కలుపుకొని.. గులాబీ కండువాలతో అనేక ప్రజాసమస్యలపై మాట్లాడామన్నారు. ఇవన్నీ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు ఎలా అవుతాయని ఆమె ప్రశ్నించారు. ఈ అంశంపై భారత రాష్ట్ర సమితి పెద్దలు పునరాలోచన చేయాలన్నారు.

### హరీశ్‌రావు, సంతోష్ ఇళ్లల్లో బంగారం ఉంటే బంగారు తెలంగాణ అవుతుందా?

"కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీసీల అంశంపై మాట్లాడుతుంటే పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నట్లు చిలువలు పలువలుగా ప్రచారం చేశారు. సామాజిక తెలంగాణకు కట్టుబడి ఉన్నానని చెప్పాను. దానిలో తప్పేముంది?నా తండ్రి కేసీఆర్ టికెన వేలు పట్టుకుని ఓనమాలు నేర్చుకున్నా. ఆయన స్ఫూర్తితోనే సామాజిక తెలంగాణ అని మాట్లాడా. స్వతంత్ర భారతంలో దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పిన గొప్ప నాయకుడు కేసీఆర్. చెప్పింది చెప్పినట్లు ఆయన చేశారు. ప్రతి కులాన్ని కాపాడుకునే ప్రయత్నం చేశారు.

అది సామాజిక తెలంగాణ కాదా? నేనేమైనా తప్పు మాట్లాడానా? సామాజిక తెలంగాణ భారత రాష్ట్ర సమితికి అవసరం లేదా? భౌగోళిక తెలంగాణ వస్తే సరిపోతుందా?బంగారు తెలంగాణ అంటే హరీశ్‌రావు, సంతోష్ ఇళ్లల్లో బంగారం ఉంటే అవుతుందా?సమాజంలో ప్రతి ఒక్కరూ బాగుంటేనే బంగారు తెలంగాణ అవుతుంది.

### రామన్నా.. బుజ్జగించి అడుగుతున్నా..

నేను రామన్న (కేటీఆర్)ను గడ్డం పట్టుకొని, బుజ్జగించి అడుగుతున్నా. ఒక చెల్లిని, మహిళా ఎమ్మెల్సీని.. నాపై కుట్రలు జరుగుతున్నాయని గతంలో తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి చెప్పా. మీరు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఏం జరిగిందో నాకు ఫోన్ చేయరా అన్నా? నేను కూర్చొని ప్రెస్‌మీట్ పెడితేనే న్యాయం జరగలేదంటే.. మామూలు మహిళా కార్యకర్తకు పార్టీలో అన్యాయం జరిగితే స్పందిస్తారా.. నాకైతే అనుమానమే. హరీశ్‌రావు, సంతోష్ గురించి ఆలోచించాలని కేసీఆర్‌కు బిడ్డగా చెబుతున్నా. తెలంగాణ ఉద్యమంలో మొదట్నుంచీ హరీశ్‌రావు లేరు.పార్టీ పెట్టిన 10 నెలల తర్వాత వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు ఎప్పుడో లొంగిపోయారు. ఆయన్ను గమనించుకో రామన్న (కేటీఆర్). సీఎం రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఒకే విమానంలో ప్రయాణించారా? లేదా? చెప్పాలి. సంతోష్, హరీశ్‌రావు గ్యాంగ్‌లు భారత రాష్ట్ర సమితికి పట్టిన జలగలు. వాళ్లిద్దరూ మా మంచి కోరుకునే వారు కాదు. హరీశ్, సంతోష్ అవినీతి వల్లే కేసీఆర్‌కు సీబీఐ మరక అంటింది.

గతంలో పార్టీకి ఒక్క క్షణం చెడ్డపేరు రాగానే హరీశ్‌రావు వెళ్లి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని కలవలేదా? ఆయన ట్రబుల్ షూటర్ కాదు.. బబుల్ షూటర్. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీతో మాట్లాడి రెండో అభ్యర్థిని పెట్టాలని హరీశ్ రావు ప్రతిపాదించారు. ఓ బీజేపీఎమ్మెల్యే నాకు ఫోన్ చేసి చెబితే కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లా. హరీశ్‌రావు ట్రబుల్ క్రియేట్ చేసి.. పరిష్కరించినట్లు నటిస్తారు. 2018 ఎన్నికల్లో 25 మంది ఎమ్మెల్యేలకు హరీశ్ రావు విడిగా డబ్బులు ఇచ్చారు. ఆ డబ్బు కాళేశ్వరం అవినీతిది కాదా? 2009లో కేటీఆర్‌ను ఓడించేందుకు నాడు డబ్బు పంపారు. 2007 నుంచి నేను రోడ్డుపైనే ఉన్నాను. కేసీఆర్ ఆరోగ్యాన్ని, పార్టీని కాపాడాలని కేటీఆర్‌ను కోరుతున్నాను. ఆరడుగుల బుల్లెట్ ఇవాళ నన్ను గాయపరిచింది.. రేపు ఎవరిని గాయపరుస్తుందో? హరీశ్‌రావు కారణంగానే ఈటల రాజేందర్, జగ్గారెడ్డి మొదలైన వారంతా పార్టీ నుంచి బయటకు వెళ్లారు. దుబ్బాక, హుజురాబాద్‌లో పార్టీ ఓటమికి ఆయనే కారణం. హరీశ్‌రావు నక్క జిత్తులను గమనించాలి.

కేసీఆర్ వెంట నీడలా ఉండే సంతోష్‌కు ధనదాహం ఎక్కువ. హరితహారం మాటున గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పేరిట నకిలీ కార్యక్రమం చేపట్టారు. నిజామాబాద్‌లో నా ఓటమితో ప్రారంభించి.. కామారెడ్డిలో కేసీఆర్ ఓటమి వరకు కుట్ర చేశారు. మాజీ ఎమ్మెల్యేల్లో చాలా మంది సంతోష్ బాధితులు ఉన్నారు. భారత రాష్ట్ర సమితి సాఫ్ట్‌వేర్ అయితే.. తెలంగాణ జాగృతి హార్డ్‌వేర్. పార్టీకి నా కంట్రిబ్యూషన్ లేదా? కేవలం హరీశ్ రావు, సంతోష్‌ది మాత్రమే ఉందా?మేకవన్నె పులులను పార్టీలో ఉంచుకుంటే ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలి.

కేసీఆర్ నిర్ణయాన్ని ప్రశ్నించలేను. మా కుటుంబంలో నలుగురికి ఫోన్ ట్యాపింగ్ నోటీసులు వచ్చాయి. కేటీఆర్‌కు సంబంధించిన వారి ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. హరీశ్‌రావు, సంతోష్, శ్రవణ్‌లే ఫోన్ ట్యాపింగ్ చేయించారు. నేను ఏ పార్టీలోనూ చేరేది లేదు. ఇప్పుడు బాధలో ఉన్నా. రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటా. ఆ తర్వాత అందరితో చర్చించి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటా. నేను ప్రజల వద్దకే వెళ్తా"అని కవిత అన్నారు.

### గుత్తా సుఖేందర్ రెడ్డికి కల్వకుంట్ల కవిత ఫోన్..

నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవికి కల్వకుంట్ల కవితచేసిన రాజీనామా లేఖను బుధవారం తెలంగాణ శాసన మండలి కార్యాలయంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిఓఎస్డీకి తెలంగాణ జాగృతి నాయకులు అందజేశారు. అనంతరం గుత్తా సుఖేందర్ రెడ్డికి కవిత ఫోన్ చేశారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. ప్రస్తుతం తాను అందుబాటులో లేనని.. రేపు మరోసారి ఫోన్‌లో మాట్లాడి రాజీనామాపై నిర్ణయం తీసుకుంటానని చైర్మన్ గుత్తా చెప్పారు. అంతేకాదు.. బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి చేసిన రాజీనామా లేఖను తెలంగాణ భవన్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డికి తెలంగాణ జాగృతి నాయకులు అందజేశారు. లేఖను తీసుకొని రిసీవ్డ్ కాపీ భవన్ సెక్రటరీ అందజేశారు.

## ముందుచూపులేకనే దేశవ్యాప్తంగా యూరియా కొరత



- సరైన సమయానికి సరఫరా చేయకపోవడంతో ఆందోళనలో రైతాంగం
- తెలంగాణలో పంటలకు సెప్టెంబర్లో ఎరువులు చాలా అవసరం
- ఖరీఫ్ సీజన్ కి 11 లక్షలు మెట్రిక్ టన్నులు కోరితే 9.8 లక్షల మెట్రిక్ టన్నులు ఇస్తామన్నారు
- ఇప్పటివరకు 5.20 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారు
- తెలంగాణ లో బ్లాక్ మార్కెట్‌కు ఆస్కారం లేదు..జిల్లా కలెక్టర్ల వద్ద పూర్తి సమాచారం
- వరదలతో సంభవించిన పంట నష్టాన్ని కేంద్ర ప్రభుత్వానికి తెలుపుతాం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

2లో...

## ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌తోనే పాలమూరు అభివృద్ధి

- అవి బాగున్న ప్రాంతాలలో ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతారు
- గత పాలకుల కారణంగా ఈ రెండింటికి ఆ ప్రాంతం నోచుకోలేదు
- పక్కనే కృష్ణానది ప్రవహిస్తున్న నీటిని తీసుకోలేకపోయాం
- విద్యాపరంగా అభివృద్ధిని సాధించలేక వలస కూలీలుగా మారిపోయారు
- దేశంలో ఏ ప్రాజెక్టు, ఏ నిర్మాణాన్ని చేపట్టిన పాలమూరు ప్రజల కష్టం ఉండేది
- బూర్గుల రామకృష్ణ రావు తర్వాత నేను ముఖ్యమంత్రిని అయ్యాను
- మన జిల్లాను మనమే అభివృద్ధి చేసుకునే అవకాశం లభించింది - ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌తోపాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాం : సీఎం రేవంత్ రెడ్డి




2లో...

## ప్రతీ జర్నలిస్టుకు ఎఐ పరిజ్ఞానం తప్పనిసరి



2లో...

జర్నలిజం రంగంలో కూడా కృత్రిమ మేధను విరివిగా వాడుతున్నారు
దేశంలో వివిధ ప్రాంతాలలో ఏఐ శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయి
తెలంగాణలో జర్నలిస్టులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం ఇదే మొదటి ప్రయత్నం

## 2028 జనవరి నాటికి ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తి చేస్తాం



నెలకు 178 మీటర్ల సొరంగం తవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నాం
అత్యాధునిక హెలీబోర్న్ సర్వే నిర్వహించాలని నిర్ణయించాం
దీంతో పనుల సమయంలో ప్రమాదాలను ముందుగానే పసిగట్టొచ్చు.
నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్

2లో...

## సమ్మక్క-సారక్క జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటాలి

తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక సమ్మక్క-సారక్క జాతర
జాతర చుట్టూ పక్కల ప్రాంతాల్లో శాశ్వత నిర్మాణాలు పటిష్టంగా ఉండాలి
రెండు కుంభమేళాలు నిర్వహించిన సంస్థలే మాస్టర్ ప్లాన్ రూపకల్పన
రాష్ట్ర సచివాలయంలో మేడారం మాస్టర్? ప్లాన్? సమీక్షా సమావేశం
రివ్యూలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్



2లో...

# ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌తోనే పాలమూరు అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, మహబూబ్ నగర్: ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌తోనే మన బతుకులు బాగుపడతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం మూసాపేట మండలం వేముల గ్రామంలోని ఎస్జీడీ కార్నింగ్ ఫార్మా షూటికల్‌గ్లాస్ క్యూబింగ్ జాయింట్ వెంచర్ ఫర్నేష్ లైటింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ బాగున్న ప్రాంతాలలో ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతారు. కానీ ఉమ్మడి పాలమూరు జిల్లా గత పాలకుల కారణంగా ఈ రెండింటికి నోచుకోలేకపోయింది. పక్కనే కృష్ణానది ప్రవహిస్తున్న నీటిని తీసుకోలేకపోయాం.. విద్యాపరంగా అభివృద్ధిని సాధించలేక ఈ ప్రాంత ప్రజలు కూలీలుగా.. వలస కూలీలుగా మారిపోయారు. ఈ ప్రాంతమంతా కరువు ప్రాంతం అయ్యింది. దేశంలో ఏ ప్రాజెక్టు, ఏ నిర్మాణాన్ని చేపట్టిన పాలమూరు ప్రజల కష్టం ఉండేది అన్నారు. దేశ విదేశాల నుండి వచ్చే బృందాలను ఈ ప్రాంతంలో ఉన్న కరువును చూపించేందుకు గత పాలకులు ఆహ్వానించారు. ఇటువంటి ఈ జిల్లా ప్రజలు కెసిఆర్ ను ఎంపీగా గెలిపిస్తే చేసింది ఏమీ లేదు అన్నారు. బూర్గుల రామకృష్ణ రావు తర్వాత 75 సంవత్సరాలకు ఈ ప్రాంత బిడ్డగా మీ అందరి సహకారంతో నేను ముఖ్యమంత్రిని అయ్యాను. మన జిల్లాను మనమే అభివృద్ధి చేసుకునే అవకాశం లభించింది. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ తోపాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. పాలమూరు యూనివర్సిటీ .. పేరుకే యూనివర్సిటీ.. పరిస్థితి ఒక పీజీ కళాశాల ల ఉండేది అన్నారు. ఇప్పుడు ఇక్కడ లా, ఇంజనీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేసి యూనివర్సిటీ కీర్తిని పెంచుతున్నాము అన్నారు. మరోవైపు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, ట్రిపుల్ ఐటి నీ మంజూరు చేసుకున్నాము అని ముఖ్యమంత్రి చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని విద్యార్థులు అత్యున్నత చదువులు చదివి ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజనీర్లు కావాలి అన్నారు. ఉన్నత విద్య చదవడంతో పాటు ఎంచుకున్న వృత్తిలో నైపుణ్యాన్ని సాధించేందుకు వృత్తి నైపుణ్య కేంద్రాలను , వీలున్నచోట పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాము అన్నారు. ఇందుకోసం ఆయా జిల్లాల కలెక్టర్ల నుండి నివేదికలను తెప్పించుకుంటానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా ఏ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన మొదటి ముద్ద నా పాలమూరుకే అని అన్నారు. ఇందుకోసం సహచర మంత్రులు,

తదితరులు ఏమీ అనుకున్న నేను నా జిల్లాకే ప్రాధాన్యతను ఇస్తానని ముఖ్యమంత్రి వెల్లడించారు. గత పాలకులు ఇక్కడి కరువు పరిస్థితులను, ప్రజల దుస్థితులను చూపించేందుకు విదేశీ బృందాలను తీసుకువస్తే.. అభివృద్ధి , పరిశ్రమలు, ప్రాజెక్టులు,గొప్ప గొప్ప విద్యాసంస్థలను ఏర్పాటుచేసి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న జిల్లాగా చూపిద్దాము అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**ప్రాజెక్టులను అడ్డుకోవద్దు..**

గత ప్రభుత్వము పాలమూరు జిల్లాలో ఒక ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసుకోవడంతో పాటు నారాయణపేట –కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి సాగునీటిని అందించేందుకు ముందుకు వెళుతుంటే.. కొంతమంది కేసులు వేస్తున్నారు. మరి కొంతమంది రైతులను రెచ్చగొట్టి భూ సేకరణ జరగకుండా కుట్రలు చేస్తున్నారు అని ముఖ్యమంత్రి ఆరోపించారు. మీడియా కూడ ప్రాజెక్టులకు వచ్చే ఆటంకాలను పరిశీలించి ప్రజలలో సానుకూల వైఖరి వచ్చేలా చూడాలి అన్నారు. ప్రాజెక్టుల కోసం తీసుకునే పొలాలలో ఎక్కడ 11 లక్షలకు రూపాయలకు మించి ఇచ్చిన దాఖలాలు లేవు అన్నారు. నారాయణపేట –కొడంగల్ ఎత్తిపోతలకు అడ్డుపడుతున్న రైతులను ఒప్పించే బాధ్యతలను తీసుకోవాలని మంత్రి శ్రీహరి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డికి ముఖ్యమంత్రి అప్పగించారు.

**సీఎంకు కానుకగా ఇద్దాం : దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్..**

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని స్థానాలను గెలిచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కానుకగా ఇద్దాము అని పార్టీ నాయకులు, శ్రేణులకు దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా




ఈ ప్రాంత బిడ్డ ఉండడంవల్ల వేగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టకోగలుగుతున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి కోసం ప్రతి ఏటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20వేల కోట్ల రూపాయలను కేటాయిస్తాము అని చెప్పారు. ఆ హామీ లో భాగంగా అనేక అభివృద్ధి పనులను చేసుకోగలుగుతున్నాము అన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల, డిగ్రీ కళాశాలలను, కోర్టును, దేవరకద్రను మున్సిపాలిటీగా చేసుకున్నాము అన్నారు. నియోజకవర్గంలో మిస్సైల్ తయారీ కంపెనీ ఏర్పాటు కోసం సీఎం అన్ని విధాల సహకరిస్తున్నారు అన్నారు. కురుమూర్తి దేవాలయ అభివృద్ధి కోసం 110 కోట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేశారు. పనులను పూర్తి చేసి బ్రహ్మోత్సవాల నాటికి ముఖ్యమంత్రిని ఆహ్వానించి ప్రారంభింప చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కొత్తగా ఏర్పడిన దేవరకద్ర మున్సిపాలిటీ అభివృద్ధికి 30 కోట్ల రూపాయలు మంజూరు చేయడంతో పాటు, కొత్తకోట లో డిగ్రీ కళాశాల, జాతీయ రహదారి పొడవున జరిగే ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు వీలుగా మూసాపేట వద్ద రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి కోసం అన్ని విధాల ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారు. మన అందరం

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో వార్డు మెంబర్ల నుండి, జిల్లా పరిషత్ చైర్మన్ ల వరకు అన్ని స్థానాలను గెలిపించుకొని ముఖ్యమంత్రి కి కానుకగా ఇద్దాము అని ఎమ్మెల్యే జిఎంఆర్ పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ అధ్యక్షతను వహించిన ఈ కార్యక్రమాలలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీహరి, ఎంపీ డాక్టర్ మల్లు రవి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేద్ ఉల్లా కొత్వాల్, ఎమ్మెల్యేలు ఎ న్నం శ్రీనివాసరెడ్డి, అనిరుద్ రెడ్డి, మెగా రెడ్డి, పరిణికా రెడ్డి, వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఏనుగు నరసింహారెడ్డి, హెచ్డి టెక్నాలజీ మేనేజింగ్ డైరెక్టర్లు దీపక్ సర్జిత్, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ముందుచూపులేకనే దేశవ్యాప్తంగా యూరియా కొరత

## - వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : కేంద్ర ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో దేశవ్యాప్తంగా యూరియా కొరత సమస్యగా అధికమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విమర్శించారు. యూరియా సరైన సమయానికి సరఫరా చేయకపోవడంతో రైతాంగం ఆందోళనలో ఉందని, తెలంగాణలో పంటలకు సెప్టెంబర్ లో ఎరువులు చాలా అవసరం ఉంటుందన్నారు. బుధవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వరదలతో సంభవించిన పంట నష్టాన్ని కేంద్ర ప్రభుత్వానికి తెలుపుతామని, ఖరీఫ్ సీజన్ కి 11 లక్షలు మెట్రిక్ టన్నులు కోరితే 9.8 లక్షల మెట్రిక్ టన్నులు ఇస్తామని ఇప్పటివరకు 5.20 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారని చెప్పారు. తెలంగాణ లో బ్లాక్ మార్కెట్ కు ఆస్కారం లేదని, జిల్లా కలెక్టర్ల వద్ద పూర్తి సమాచారం ఉంటుందని యూరియా సమస్య ఒక్క తెలంగాణే కాదు దేశవ్యాప్తంగా ఉందన్నారు. చైనా నుంచి ,ఎర్ర సముద్రం మీదుగా వచ్చే యూరియా రాకపోవడంతో యూరియా కొరత వచ్చిందని, దేశీయంగా ఉత్పత్తి పెంచకపోవడంతో ,కేంద్ర వైఫల్యంతో కొరత ఏర్పడిందన్నారు. తెలంగాణలో భారీ వర్షాల ప్రాథమిక అంచనా ప్రకారం 2.5 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. రాష్ట్రాన్ని ఆదుకోవాలని కేంద్ర వ్యవసాయ మంత్రిని కోరతామని రామగుండంలో నాలుగు నెలలుగా ఉత్పత్తి లేదని ఇంకా 15 రోజుల వరకు ఉత్పత్తి జరిగే పరిస్థితి లేదన్నారు. కొత్తగూడెం ఎయిర్ పోర్టు అంశంపై రామ్మోహన్ నాయుడును కలుస్తాం గత వరదల విషయంలో సాయం చేయలేదు. జేపీ నడ్డా,అమిత్ షా,శివరాజ్ సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, రామ్మోహన్ నాయుడు,అశ్విని వైష్ణవ్ ను కలుస్తామన్నారు. రెండు రోజులు పర్యటన చేసి కేంద్రమంత్రులను కలిసి రాష్ట్ర సమస్యలు కేంద్ర మంత్రులకు వివరిస్తామన్నారు.

**ఆయిల్ పామ్ గెలలకు టన్నుకు రూ. 25 వేలు మద్దతు ధర కల్పించాలి..**

ఆయిల్ పామ్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలోని నారాయణపేట, ములుగు, కొమురంభీం ఆసిఫాబాద్, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడం జిల్లాలను ప్రధాన్ మంత్రీ ధన్–ధాన్య కృషి యోజన పథకంలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ యంత్రాలపై, మైక్రో ఇరిగేషన్ పరికరాలపై ఉన్న 12 శాతం జిఎస్టీని మినహాంచాలన్నారు. పాస్పరస్ , పొటాషియం , సల్ఫర్ వంటి పోషకాలపై సబ్సిడీ పెంచి యూరియాతో సమానంగా ధరలో సమతుల్యత తీసుకురావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రూ.24 వేల కోట్ల వార్షిక వ్యయంతో, ఆరు సంవత్సరాలపాటు అమలు చేయబోతున్న ధాన్య కృషి యోజన 36 కేంద్ర పథకాల సమన్వయంతో పాటు రాష్ట్ర పథకాలతో అనుసంధానం అవుతూ, ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని వినియోగించుకోవడం ద్వారా తక్కువ పనితీరు చూపుతున్న జిల్లాలకు విస్తృతంగా లాభం చేకూరుస్తుందని ప్రశంసించారు.

ఉత్పాదకత పెంపు, పంటల వైవిధ్యీకరణ, నీటిపారుదల, నిల్వ, విలువవృద్ధి వంటి అంశాల్లో ఇది ఒక చారిత్రాత్మక పథకమని అన్నారు. రాష్ట్రంలోని నారాయణపేట, ములుగు, కొమురంభీం ఆసిఫాబాద్, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడం జిల్లాలను యోజన పథకం జాబితాలో చేర్చాలన్నారు. ఈ జిల్లాలు వర్షాధార పద్ధతులపై అధికంగా ఆధారపడిన, తక్కువ ఉత్పాదకత కలిగిన, బలహీన రైతు వర్గాలను కలిగి ఉన్నాయి. వీటిని చేర్చడంతో తెలంగాణ రైతుల సంక్షేమమే కాకుండా దేశవ్యాప్తంగా ఆహార భద్రత, విలువవృద్ధి, ఉపాధి అవకాశాల పెంపుకు తోడ్పడుతుందని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం తన రాష్ట్ర పథకాలతో పూర్తి అనుసంధానం చేస్తూ, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అగ్రికల్చరల్ యూనివర్శిటీలు భాగస్వామ్యంతో బలమైన జిల్లా స్థాయి ప్రణాళికలను సిద్ధం చేస్తుంది. డిజిటల్ మానిటరింగ్ ద్వారా పారదర్శకతను నిర్ధారిస్తామని హామీ ఇచ్చారు.

**వ్యవసాయ యంత్రాలపై జీఎస్టీ మినహాయించాలి..**

వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, ఉద్యానవనాల కోసం మైక్రో ఇరిగేషన్ పరికరాలపై విధిస్తున్న 12 శాతం జీఎస్టీని పూర్తిగా మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయం, ఉద్యానవన రంగాలు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలుగా నిలుస్తున్నాయని, రైతులకు ఆధునిక యంత్రాలు,నీటిపారుదల సాంకేతికత అందుబాటులో ఉంటే ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, ఉద్యానవనాల కోసం మైక్రో ఇరిగేషన్ పరికరాలపై 12 శాతం జీఎస్టీ విధించడం, రైతులపై తీవ్రమైన ఆర్థిక భారంగా మారిందన్నారు. చిన్న, సన్న రైతులు ఆధునిక పరికరాలను కొనుగోలు చేయలేకపోతున్నారని, ఫలితంగా వ్యవసాయంలో యాంత్రీకరణ, ఆధునిక పద్ధతుల వినియోగం మందగిస్తుందని వివరించారు. దేశ ఆహార భద్రత మరింత బలపడేదిశగా ఉండాలంటే ప్రస్తుతం వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, ఉద్యానవనాల కోసం మైక్రో ఇరిగేషన్ పరికరాలపై ఉన్న జీఎస్టీని మినయించాలని కోరారు.

**ఎరువుల సబ్సిడీ పెంపు చేయాలి..**

ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులపై సబ్సిడీ పెంపు అవసరాన్ని కేంద్ర మంత్రికి వివరించారు. ప్రస్తుతం న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ విధానంతో యూరియాపై ఎక్కువ సబ్సిడీ ఉన్నందున, రైతులు దానిని విస్తృతంగా వినియోగిస్తున్నారని, ఫలితంగా భూమిలో నత్రజని అధికమై, ఫాస్పరస్, పొటాషియం, సల్ఫర్ వంటి పోషకాల వినియోగం తగ్గిపోతుందని వివరించారు. దీనితో నేలలో పోషక సమతుల్యత దెబ్బతింటోందని, పంట దిగుబడులు కూడా దీర్ఘకాలంలో పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా, 4:2:1 నత్రజని, ఫాస్పరస్, పొటాషియం సిఫార్సు నిష్పత్తి పూర్తిగా చెడిపోయి 2018–19లో 6.6:2.6:1కి పడిపోయిందని, ఇది రైతులకు దేశ ఆహార భద్రతకు ప్రమాదకరమని గుర్తు చేశారు. తక్కువ ధరలో యూరియా లభించగా, అంతర్జాతీయ ధరల ప్రభావంతో ఫాస్పరస్, పొటాషియం ఎరువులు ఖరీదుగా మారుతున్నాయని తెలిపారు.ఈ అంశాలపై స్పందించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వీటిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

# 2028 జనవరి నాటికి ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తి చేస్తాం

విశ్వంభర, హైదరాబాద్: ఆధునిక పరిజ్ఞానంతో మిగిలిన 9 కి.మీల మేర ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.ఈ క్రమంలో అత్యాధునిక హెలీబోర్న్ సర్వే నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. బుధవారం ఎస్ఎల్‌బీసీ పనుల పునఃప్రారంభంపై మంత్రి సమీక్ష నిర్వహించారు.

"ఎస్ఎల్‌బీసీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నెలకు 178 మీటర్ల సొరంగం తవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నాం. 2028 జనవరి నాటికి పూర్తి చేయాలని సంకల్పించాం. ఎన్‌జీఆర్ఐ ద్వారా హెలీబోర్న్ సర్వే నిర్వహిస్తాం. దీంతో పనుల సమయంలో ప్రమాదాలను ముందుగానే పసిగట్టొచ్చు. జాప్యం లేకుండా సర్వే చేసేందుకు అధికారులు ఏర్పాటు చేయాలి. మూడు షిఫ్టుల్లో పనిచేసేలా ప్రణాళికలు రూపొందించాలి. సవరించిన అంచనాల పరిధిలోనే ప్రాజెక్టు పూర్తి చేయాలి" అని అధికారులకు మంత్రి ఉత్తమ్ దిశానిర్దేశం చేశారు.



# ప్రతీ జర్నలిస్టుకు ఏఐ పరిజ్ఞానం తప్పనిసరి

మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, హైదరాబాద్ః హైదరాబాద్‌లోని నాంపల్లి మీడియా అకాడమీ ఆడిటోరియంలో కృత్రిమ మేధలో,టూల్స్, టెక్నిక్స్, వర్క్ షాపును తెలంగాణ మీడియా అకాడమీ, అదిరా డాటా లీడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ప్రముఖ దినపత్రికలు, టీవీ ఛానల్స్‌కు చెందిన తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలకు సంబంధించిన దాదాపు 100 మందికి పైగా జర్నలిస్టులు ఈ వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిజం రంగంలో కూడా ఏఐని విరివిగా వాడుతున్నారని అన్నారు. అందులో భాగంగా న్యూస్ రూములు పరివర్తన చెందినందున జర్నలిస్టులు కూడా ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిజంలో భాగంగా డిజిటల్ మీడియా, సోషల్ మీడియాలో ఏఐని జర్నలిస్టులు వృత్తిలో భాగంగా ఉపయోగించుకొని రిపోర్టింగ్‌లో సులభతరమైన పద్ధతులను పాటించి తక్కువ సమయంలోనే ఎక్కువ అంశాలను పాఠకులకు, వీక్షకులకు అందించవచ్చు అని ఆయన తెలిపారు. ఏఐ సాంకేతికతపై లోతైన నైపుణ్యం ఉన్న, ఇంటర్నేషనల్ ట్రైనర్ ఉడుముల సుధాకర్ రెడ్డి శిక్షణ నిర్వహించారు. దేశంలో వివిధ ప్రాంతాలలో ఏఐ శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. అలాగే తెలంగాణలో జర్నలిస్టులకు ఏఐలో శిక్షణా కార్యక్రమం నిర్వహించడం ఇదే మొదటి ప్రయత్నం అని ఆయన అన్నారు. ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టు కూడా నిత్య విద్యార్థి లాగా ఉండాలన్నారు. అదేవిధంగా తాను కూడా నిత్యం ఏదో ఒకటి నేర్చుకుంటూ నిత్య విద్యార్థిగానే కొనసాగుతున్నానని తన వృత్తి జీవితం గురించి వివరించారు. ఏఐ శిక్షణలో భాగంగా ఏఐ టూల్స్ ఉపయోగాలు, ప్రమాదాలు, ఏఐ పద్ధతులు, నియమ నిబంధనలు, ప్రాథమిక అంశాల గురించి విస్తృతంగా వివరించారు. కృత్రిమ మేధ



జర్నలిస్టుల వృత్తిలో భాగంగా తప్పనిసరి అయిందని, ఏఐ మనసును భ్రమింప జేసి తప్పుడు సమాచారాన్ని వివక్ష లాంటి సమాచారాన్ని అందించే ప్రమాదం ఉందన్నారు. తన వద్ద ఉన్న ఉదాహరణల ఆధారంగా ఏఐ అవుట్ పుట్ టూల్స్ కూడా జాతి, మత, వర్గ, లింగ భేదాలు కలిగించే కంటెంట్ ను అందిస్తాయన్నారు.ఆటోమేషన్ లో భాగంగా ఏఐ ఏజెంట్స్ వస్తున్నాయని, దీని ద్వారా రాబోయే కాలంలో వివిధ రకాల ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని ఆయన తెలియజేశారు. చాట్ జిపిటి, పెర్ప్లెక్సిటీ, నోట్ బుక్ ఎల్ ఎం, గూగుల్, జమినయి, మిడ్ జర్నీ, సోరా, విఇఓ3, తదితర టూల్స్‌ని పరిచయం చేసి జర్నలిస్టులు ఎలా ఉపయోగించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఉదాహరణల ద్వారా అవగాహన కలిగించారు. %గూ×% డాటా ట్రైయినింగ్‌లో వినియోగంలో లోపం వల్ల, ప్రాంప్టింగ్ ఇంజినీరింగ్ సరిగా చేయకపోవడం వల్ల, ఈ వివక్ష లేదా తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతుంది అన్నారు. %గూ×% నైతిక నియమాలు తదితర అంశాలకు లోబడి జర్నలిస్టులు బాధ్యతా యుతంగా కృత్రిమ మేధ పరిజ్ఞానంను ఉపయోగించాలని ఆయన సూచించారు.

# సమ్మక్క–సారక్క జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటాలి

మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సమ్మక్క సారక్క వనదేవతల జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.., పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క.., ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. గతం కంటే ఈ సారి చాలా ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని దేవాదాయ శాఖ మంత్రి కార్యాలయం కాన్ఫరెన్స్ రూంలో మేడారం మాస్టర్? ప్లాన్? సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశం మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో జరగ్గా... మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎండోమెంటు ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ములుగు కలెక్టర్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు. పలుమార్లు కుంభమేళలు నిర్వహించిన సంస్థకు మాస్టర్ ప్లాన్ నిర్వహణ బాధ్యతలు అప్పగించినట్టు అధికారులు మంత్రులకు వివరించారు. సమ్మక్క సారలమ్మ పూజారుల సూచనల మేరకు మేడారం దేవాలయ ప్రాంగణ నూతన డిజైన్ ను మంత్రులు ప్రత్యేకంగా పరిశీలించారు. డిజైన్లలో చేయాల్సిన మార్పులపై మంత్రులు సూచనలు చేశారు. మేడారం నిర్వహణ పనులను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహా మేడారం జాతరలోపు పూర్తి చేయాల్సిన పనులను త్వరగా చేపట్టాలని మంత్రులు సూచించారు. సమ్మక్క సారలమ్మ పూజారులతో చర్చించి వారి అభిప్రాయం మేరకు ఆధునికరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. భక్తుల సందర్శనార్థం అమ్మవారి గద్దెల ఎత్తు పెంచాలని పూజారులు ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా... తగిన మేరకు డిజైన్లు మార్చాలన్నారు. భక్తుల సందర్శనార్థం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు గోవింద రాజుల గద్దెలు ఒకే వరుస క్రమంలో ఉండేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తద్వారా ఎలాంటి జాప్యం లేకుండా సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను భక్తులు దర్శించుకునేందుకు అనువుగా ఉంటుందని మంత్రులు చెప్పారు. గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమ్మక్క సారలమ్మ సేవ కోసం జాతర సమయంలో భక్తులకు సహాయపడేందుకు వాలంటీర్లను నియమించాలన్నారు. ఆదివాసి సంస్కృతి సాంప్రదాయ బద్ధంగా మేడారం పరిసరాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. మేడారం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ మహా మేడారం జాతరకు రూ. 150 కోట్లు ప్రజా ప్రభుత్వం కేటాయించిందని గుర్తు చేశారు. అవసరమైతే ఇతర శాఖల సహాయంతో మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. జాతర నిర్వహణ ఏర్పాట్లు, మేడారం మాస్టర్ ప్లాన్ డిజైన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి... ఆయన అనుమతి తీసుకున్న తర్వాత ముందుకు వెళతామన్నారు. మేడారం అభివృద్ధి ప్రతి దశలో పూజారుల ను భాగస్వామ్యం చేస్తామన్నారు. సమ్మక్క సారలమ్మల త్యాగాన్ని ఔన్నత్యాన్ని మరింత చాటి చెప్పే విధంగా మేడారం ఆలయ ప్రాంగణాన్ని సిద్ధం చేస్తామన్నారు. సమ్మక్క, సారలమ్మ దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ వస్తుందని మంత్రులు చెప్పారు. దేశ విదేశాల నుంచి వచ్చే వారి కోసం సకల సౌకర్యాలు కల్పించేందుకు పట్టిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు జరిగితే మేడారం జాతర మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతర సమయంలో వెహికల్ మేనేజ్మెంట్ సరైన విధంగా ఉండేలా డిజైన్‌లు రూపకల్పన చేయాలన్నారు. ప్యూరిఫైడ్ వాటర్ అందించాలని మంత్రి సురేఖ సూచించారు. బెల్లం కింద పడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అడ్లూరి సలహానిచ్చారు. బ్యాటరీవెహికల్స్ ను వినియోగించుకోవాలన్నారు. క్రౌడ్ మేనేజ్ మెంటుకి ఏఐ ఎనబుల్డ్ కెమోరాలను ఉపయోగించాలన్నారు. సేవా పద్ధతిన భక్తులను మ్యాన్ పవర్ కింది వినియోగించుకోవాలన్నారు. వనజాతర వస్తున్న తరుణంలో దారి పొంటి ఉన్న టెంపుల్స్ ను కూడా అవసరమైన మేరకు అలంకరణ చేయాలన్నారు. ఈ క్రమంలో భక్తులు ఆయా టెంపుల్‌లను దర్శించుకుంటారని మంత్రి సురేఖ చెప్పారు.

## నీట్ స్థానికత అంశంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలి

–విశ్వంభర, హైదరాబాద్‌: సుప్రీంకోర్టు నీట్ విద్యార్థుల స్థానికతపై ఇచ్చిన తీర్పు వల్లే తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు కూడా తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. కేవలం 9,10,11,12 తరగతులు మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం వల్ల ఇతర రాష్ట్రలకు వెళ్ళి పోటీ పరీక్షలు కోసం చదువుతున్న రాష్ట్ర విద్యార్థులు తెలంగాణలో రాష్ట్ర యేతరులుగా మారే ప్రమాదం ఉంది.అలాగే ప్రస్తుతం 9,10, తెలంగాణ రాష్ట్రంలో చదివి 11,12 నీట్ లాంగ్ టర్మ్ కోసం ఇతర రాష్ట్రాలు వెళ్ళి కోటా, అలెన్, ఆకాశ్,పిడ్జి లాంటి సంస్థలలో చదువుతున్న విద్యార్థులు కూడా ఈ తీర్పు వల్లన స్థానికేతరులుగా మారతారు అలాంటి విద్యార్థులు ఏక్కడ స్థానికులో ప్రభుత్వం తెలుపడం లేదు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తే తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. అందుకే తీర్పుపై రివ్యూ పిటిషన్ వేసి తాము స్థానికత అంశంపై ఇచ్చిన జీ.వో. లో మార్పులు తెవాలని ఎస్.ఎఫ్.ఐ. రాష్ట్ర కమిటీ ప్రభుత్వాని కోరుతుంది. తద్వారా తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు ఇక్కడే స్థానికులుగా ఉండేలా చూడాలని ఎస్ఎఫ్ఐ కోరుతుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

## రుషికొండ ప్యాలెస్‌ను మానసిక వైద్యశాలగా మార్చాలి

### గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు

విశ్వంభర, విశాఖపట్నం: ప్రజాధనంతో నిర్మించిన రుషికొండ ప్యాలెస్‌ను మానసిక వైద్యశాఖ (పిచ్చి ఆసుపత్రి)గా మార్చాలని గోవా గవర్నర్ పి.అశోక్‌గజపతి రాజు సలహా ఇచ్చారు. క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం విశాఖలో ఆయనకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశోక్‌గజపతిరాజు మాట్లాడారు.“అల్లూరి విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నాం.. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలి. చాలా ఏళ్లు ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశాను. అప్పుడు సంక్షేమం కోసం అప్పులు చేసేవారు. కానీ, గత ప్రభుత్వంలో అన్ని తాకట్టులో పెట్టడం చూశా. విశాఖలో ప్రజాధనంతో కట్టిన రుషికొండ ప్యాలెస్ పెచ్చులు ఊడిపోయాయని తెలిసింది. అదే రూ.600 కోట్లు ఉంటే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తయ్యేది.

# కేసీఆర్ పాలనలో తెలంగాణ స్వర్ణయుగం

## సాగునీటి ప్రాజెక్టులతో తెలంగాణ సస్యశ్యామలం అయింది

**- ఆయనపై సిబిఐ విచారణ జరపాలనుకోవడం సిగ్గుచేటు- సిబిఐ పనితీరుపై రాహుల్ , రేవంత్‌లది ద్వంద్వ వైఖరి- 21 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆగమాగం అయింది- దమ్మున్న నాయకుడు ఉంటే దమ్మిడీ లేకున్నా సంక్షేమ పథకాల ఆగవు- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

విశ్వంభర, నేషనల్ బ్యూరోః తన అనుచరులతో బీఆర్ఎస్ లో చేరిన మణుగూరుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత ప్రభాకర్ రావు విశ్వంభర, హైదరాబాద్ : మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ లతో రాబోయే 50 ఏండ్ల హైదరాబాద్ తాగునీటి అవసరాలను తీర్చిన దార్శనికుడు కేసీఆర్ పై సిబిఐ విచారణ జరపడం సిగ్గుచేటు అన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు. సిబిఐని మోడీ జేబు సంస్థ అని రాహుల్ విమర్శిస్తే, రేవంత్ దాన్ని ప్రశంసించడం కాంగ్రెస్ దౌర్భాగ్యస్థితికి నిదర్శనం అన్నారు. పినపాక నియోజకవర్గం, మణుగూరుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రభాకర్ రావు, ఆయన అనుచరులు ఇవాళ ఎర్రవల్లిలో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన కేటీఆర్, భారత దేశ చరిత్రలో ఏ రాజకీయ నాయకుడు కూడా పదేళ్లలో కేసీఆర్ చేసినంత అభివృద్ధి చేయలేదన్నారు. కాళేశ్వరంతో తెలంగాణ పచ్చబడుతుంటే కొంతమంది కళ్లు ఎర్రబడుతున్నాయన్నారు. కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు అనుక్షణం గుర్తు తెచ్చుకుంటుంటే ఓర్వలేకనే కాంగ్రెస్, బీజేపీలు కక్షపూరితంగా అక్రమ కేసులతో కేసీఆర్ ను బద్నాం చేస్తున్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో ఆగమాగమైందని, ప్రజలంతా కేసీఆర్ పాలననే తిరిగి కోరుకుంటున్నారని కేటీఆర్ చెప్పారు. కేవలం 21 నెలల కాంగ్రెస్ పాలనలోనే ప్రజలు విసిగిపోయారని, “కేసీఆర్ ఉన్నప్పుడే బాగుంది” అని ప్రతి ఒక్కరూ అంటున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని విరుచుకుపడ్డారు. ఎన్నికలకు ముందు హామీల జాతర, ఎన్నికల తర్వాత చెప్పుల జాతర అన్నట్టుగా రాష్ట్రంలో యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోందన్నారు. వ్యవసాయ సొసైటీల ముందు రైతులు చెప్పుల వరుసలు పెట్టి పడిగాపులు కాయాల్సిన దుస్థితిని కాంగ్రెస్ కల్పించిందన్నారు. ఆనాటి దుర్భర రోజులను మళ్లీ తీసుకొస్తా అని చెప్పి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలను నిజాయితీగా మోసం చేశాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 2014లో వ్యవసాయ దిగుబడుల్లో 14వ స్థానంలో ఉన్న తెలంగాణను, కాళేశ్వరం, సీతారామ, పాలమూరు–రంగారెడ్డి వంటి ప్రాజెక్టులతో సస్యశ్యామలం చేసి దేశానికి అన్నం పెట్టే స్థాయికి తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌ది అన్నారు కేటీఆర్. సముద్ర మట్టానికి 80 మీటర్ల ఎత్తున ఉన్న మేడిగడ్డ నుంచి 618 మీటర్ల ఎత్తున ఉన్న కొండపోచమ్మ సాగర్‌కు రోజుకు 2 టీఎంసీల నీటిని తరలించే అద్భుతమైన, ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం అన్నారు. ఈ ప్రాజెక్టుతో లక్షలాది ఎకరాలకు సాగునీరు, ఎన్నో గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. రేవంత్ రెడ్డి తన మాటలతో, చేతలతో ముఖ్యమంత్రి పీఠానికి ఉన్న గౌరవాన్ని మంటగలుపుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణను క్యాన్సర్, ఎయిడ్స్ రోగితో పోల్చడం, ఢిల్లీకి పోతే తనను చెప్పులు ఎత్తుకుపోయేవాడిలా చూస్తున్నారని అనడం, పేగులు మెడలో వేసుకుంటా లాంటి మాటలు మాట్లాడటం ముఖ్యమంత్రి స్థాయికి తగునా అని ప్రశ్నించారు. ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్సార్, కేసీఆర్ వంటి ముఖ్యమంత్రులను చూసిన ప్రజలు, రేవంత్ రెడ్డిని చూసి సిగ్గుపడుతున్నారన్నారు. దమ్మున్న నాయకుడు ఉంటే దమ్మిడీ లేకున్నా సంక్షేమ పథకాలు ఆగవన్న కేటీఆర్, కరోనా కష్టకాలంలో రాష్ట్ర ఆదాయం సున్నా అయినా రైతుబంధు, పెన్షన్లు, జీతాలను కేసీఆర్ ఆపలేదన్నారు. కానీ కాంగ్రెస్ సన్నాసులకు పనిచేయడం చేతకాక సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం కేవలం రూ. 2.80 లక్షల కోట్లు మాత్రమే అప్పు చేసిందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అడిగిన ప్రశ్నకు కేంద్రమే స్పష్టంగా సమాధానం చెప్పినా సిగ్గులేకుండా కాంగ్రెస్ నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హామీల అమలునుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రోజూ కేసీఆర్ అరెస్ట్, కేటీఆర్ అరెస్ట్ అంటూ సొల్లు పురాణం చెబుతున్నారన్నారు కేటీఆర్ సింగరేణి కార్మికుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం ఎంతో చేసిందన్న కేటీఆర్, వారసత్వ ఉద్యోగాలు కల్పించడం నుంచి ఆరోగ్య సమస్యల వరకు అన్ని విధాలా అండగా నిలిచిందని కేటీఆర్ గుర్తుచేశారు. సింగరేణి కార్మికులకు ఇచ్చిన పది హామీల్లో ఎనిమిదింటిని పూర్తిగా, రెండింటిని పాక్షికంగా అమలు చేసిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. అయినప్పటికీ సింగరేణి ప్రాంతంలోని 13 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎందుకు ఓడిపోయిందనే దానిపై లోతుగా అధ్యయనం చేయాలన్నారు. పార్టీకి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘంకు మధ్య సమన్వయం



లోపించిందా? యూనియన్ అంతర్గత రాజకీయాలు పార్టీపై ప్రభావం చూపించాయా? అనే కోణంలో ఆనాడు చర్చించామని చెప్పారు. పార్టీ మద్దతు లేకున్నా, మణుగూరు డివిజన్‌లో కేవలం 24 ఓట్ల తేడాతోనే యూనియన్ నాయకులు ఓడిపోయారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పదికి పది అసెంబ్లీ స్థానాల్లో గులాబీ జెండా ఎగరవేయాలని కేటీఆర్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. ఈ నెల 10, 11 తేదీల్లో తాను భద్రాచలం, కొత్తగూడెం పర్యటనకు వస్తున్నట్లు ప్రకటించారు. గాడిదను చూస్తేనే గుర్రం విలువ తెలుస్తుంది అన్నట్టు, రేవంత్ రెడ్డిని చూశాకే ప్రజలకు కేసీఆర్ విలువ తెలిసిందన్నారు. కాంగ్రెస్ మోసాలను, బీజేపీతో పొంచి ఉన్న ముప్పును ప్రజలకు వివరించాలన్నారు. చిన్న చిన్న మనస్పర్థలు పక్కనపెట్టి, అందరూ కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టాలన్నా, ప్రజలు బాగుపడాలన్నా కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవడమే శరణ్యం అన్నారు. ఇంకా మూడేళ్లు అధికార పార్టీలో ఉండే అవకాశం ఉన్నప్పటికీ, అక్కడ ఉండలేక బీఆర్ఎస్‌లో చేరిన ప్రభాకర్ రావు, ఆయన అనుచరులకు కేటీఆర్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# బీజింగ్‌లో భారీ సైనిక కవాతు

**- అత్యాధునిక ఆయుధాలు ప్రదర్శించిన చైనా - రష్యా, కొరియా నేతలు పుతిన్, కిమ్ హాజరు**

విశ్వంభర, నేషనల్ బ్యూరోః రెండో ప్రపంచ యుద్ధం ముగిసి 80 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చైనా రాజధాని బీజింగ్‌లో భారీ సైనిక కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రపంచదేశాల నుంచి కీలక నాయకులు, సైనిక అధికారులు, దౌత్యవేత్తలు హాజరయ్యారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్‌తో పాటు ఇరాన్, ఆసియా దేశాల అధ్యక్షులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనడం ప్రపంచ రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీసింది.

**అగ్రరాజ్యాలకు హెచ్చరిక..**

ఈ సైనిక కవాతు ద్వారా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికాతో పాటు పశ్చిమ దేశాలకు గట్టి సందేశం పంపారు. భవిష్యత్తులో శత్రుదేశాల బెదిరింపులకు లొంగబోమని, తమ సొంత సైనిక బలాన్ని పెంచుకుంటామని స్పష్టం చేశారు. ఓపెన్ టాప్ లిమౌసిన్‌లో బయలుదేరి సైనిక బలగాలను సమీక్షించిన ఆయన తమ దేశం ఎట్టి పరిస్థితుల్లోనూ బెదిరింపులకు తలొగ్గదని, ప్రపంచ స్థాయి సైన్యాన్ని నిర్మించి యుద్ధాల్లో గెలిచే సామర్థ్యాన్ని సాధిస్తామని గట్టిగా చెప్పారు.

**కొత్త సమీకరణలు..**

ఈ సైనిక కవాతులో పుతిన్, కిమ్ జాంగ్ ఉన్‌ల హాజరు ప్రపంచ దేశాలకు ఆశ్చర్యం కలిగించింది. అమెరికాతో పెరుగుతున్న వాణిజ్య, సాంకేతిక ఉద్రిక్తతల నడుమ ఈ ముగ్గురు నాయకుల ఐక్యత రాబోయే రోజుల్లో ప్రపంచ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారి తీస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆసియా దేశాల నుంచి అనేక మంది నాయకులు హాజరు కావడం కూడా చైనా దౌత్యపరంగా సాధిస్తున్న విజయాన్ని సూచిస్తోంది.



**డొనాల్డ్ ట్రంప్ విమర్శ..**

ఈ సైనిక ప్రదర్శనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఇది అమెరికాకు వ్యతిరేకంగా చైనా, రష్యా, ఉత్తర కొరియా నాయకుల కలయిక అని ఆరోపించారు. చైనాతో వాణిజ్య ఒప్పందాలు అమెరికాకు నష్టాన్ని కలిగిస్తున్నాయని, ఈ సైనిక కవాతుతో చైనా తమ ఆధిపత్యాన్ని చాటుతోందని విమర్శించారు. అయితే చైనా ఈ విమర్శలను పట్టించుకోకుండా తమ బలాన్ని ప్రపంచానికి చాటింది.

**సైనిక బలం..**

ఈ కవాతులో చైనా తన అత్యాధునిక క్షిపణులు, యుద్ధ విమానాలు, ఇతర ఆయుధాలను మొదటిసారి ప్రపంచానికి పరిచయం చేసింది. 2019 తర్వాత చైనా నిర్వహించిన తొలి భారీ సైనిక కవాతు ఇదే. ఈ ప్రదర్శన చైనా సైనిక ఆధునికీకరణకు, ప్రపంచ రాజకీయాల్లో దాని పెరుగుతున్న ప్రభావానికి నిదర్శనంగా నిలిచింది.

# డ్రగ్స్, గంజాయి, నకిలీ మద్యంపై ఎస్‌టిఎఫ్ దాడులు

**- శేర్‌లింగంపల్లిలో 94.2 గ్రాముల చరస్, 1.023 కేజీల గంజాయి స్వాధీనం- ఇద్దరు నిందితులు అరెస్టు, స్కూటీ,సెల్‌ఫోన్లు సీజ్.- ఎస్‌టిఎఫ్ టీమ్‌లకు డైరెక్టర్ ఖాసీం “పెద్ద కేసులపై దృష్టి పెట్టాలి” అని ఆదేశం- సూర్యాపేటలో నకిలీ లిక్కర్ కేసు పట్టుకున్న టీమ్‌కు 50 వేల రివార్డు.**

విశ్వంభర, తెలంగాణ బ్యూరోః డ్రగ్స్, గంజాయి, నకిలీ మద్యం రవాణా, విక్రయాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పెద్ద ఎత్తున పట్టు బిగించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌టిఎఫ్ (స్టేట్ టాస్క్ ఫోర్స్) బృందాలు నిర్వహించిన వరుస దాడుల్లో చరస్, గంజాయి స్వాధీనం కావడంతోపాటు పలువురు నిందితులు అరెస్టయ్యారు.

**94.2 గ్రాముల చరస్ పట్టివేత – ఒకరి అరెస్టు..**

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంకు చెందిన జోగి వంశీ కృష్ణ అనే వ్యక్తి హిమాచల్ ప్రదేశ్‌లో చరస్‌ను తీసుకొని హైదరాబాద్‌కు తెచ్చి విక్రయానికి ప్రయత్నిస్తుండగా ఎస్‌టిఎఫ్ డీ టీమ్ సీఐ నాగరాజు బృందం దాడి చేసి పట్టుకుంది. షేర్‌లింగంపల్లి అప్రోచ్ బ్రిడ్జి వద్ద జరిగిన ఈ ఆపరేషన్‌లో 94.2 గ్రాములచరస్‌తో పాటు నిందితుడి మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

**1.023 కేజీల గంజాయి స్వాధీనం – స్కూటీ, సెల్‌ఫోన్ సీజ్,,**

అలాగే షేర్‌లింగంపల్లి చందనగర్‌లో ఎస్‌టిఎఫ్ శంషాబాద్ డీ టీమ్ సీఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బంది దాడి చేసి 1.023 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జె.సంతోష్ అనే వ్యక్తిని అరెస్టు చేయగా, అతనికి గంజాయి సరఫరా చేస్తున్న రాజ్‌కుమార్ పై కేసు నమోదు చేశారు. ఈ దాడిలో ఒక్క స్కూటీ, మొబైల్ ఫోన్ కూడా స్వాధీనం చేసి నిందితుడు, సాక్ష్యాలను షేర్‌లింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.

**పెద్ద కేసులపైనే దృష్టి – ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ యొక్క హెచ్చరిక..**

ఈ కేసులను పరిశీలిస్తూ అబ్కారీ భవన్‌లో సమీక్ష నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ శాన్‌వాజ్ ఖాసీం మాట్లాడుతూ, డ్రగ్స్, గంజాయి,



నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌టిఎఫ్ బృందాలకు ఆదేశించారు.ఖమ్మం, సూర్యపేట్ జిల్లాల్లో ఇటీవల జరిగిన గంజాయి, నకిలీ మద్యం కేసులపై మరింత లోతుగా దర్యాప్తు చేసి అన్ని నిందితులను అరెస్టు చేయాలని సూచించారు. అనుమతి లేని కల్లు దుకాణాలను మూసివేయడం, తరచూ తనిఖీలు చేపట్టడం, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ చెకింగ్ పాయింట్ల వద్ద ఎక్సైజ్ తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయడం వంటి వ్యూహాలను అమలు చేయాలని హితవు పలికారు.

**మంచి పనితీరు కనబరచిన అధికారులకు రివార్డు..**

సూర్యపేట్‌లో నకిలీ మద్యం తయారీ ముఠాను పట్టుకున్న ఎస్ టి ఎఫ్ – ‘ఏ’ టీమ్ కు రూ.50 వేల నగదు ప్రోత్సాహకాన్ని డైరెక్టర్ శాన్‌వాజ్ ఖాసీం బుధవారం సాంబార్‌లో అందజేశారు. మంచి పనితీరు కనబరిస్తే మరిన్ని రివార్డులు లభిస్తాయని, సోర్స్ ఇన్‌పుట్‌లను సకాలంలో వినియోగిస్తే ముఖ్యమైన కేసులు వెలుగులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.

# ఆస్పత్రుల్లో అత్యవసర పరికరాలను వెంటనే మరమ్మతు చేయాలి



విశ్వంభర, హైదరాబాద్‌: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది.సమీక్షలో ప్రభుత్వ ఆసుపత్రుల మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరికరాల వినియోగం, సామర్థ్యం, శానిటేషన్‌పై చర్చించారు. ఆసుపత్రుల ఆపరేషన్ థియేటర్లు, అత్యవసర పరికరాల నిర్వహణ అంశాలు కూడా సమీక్షలో ప్రధానాంశాలుగా నిలిచాయి.ప్రత్యేకంగా గాంధీ ఆసుపత్రి బ్రాండింగ్ అంశం చర్చించబడింది. ఈ సందర్భంగా మంత్రి అత్యవసర పరికరాలను వెంటనే మరమ్మతు చేయాలని, ఎనిమిదేళ్లు దాటిన పరికరాలను సకాలంలో తొలగించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.అదనంగా ఎన్.సి.డి. (నాన్ కమ్యూనికబుల్ డిసీసెస్) క్లినిక్స్ పనితీరుపై సమగ్ర సమీక్ష జరగగా, రోగులకు వచ్చే సహాయకుల కోసం సి.ఎస్.ఆర్. (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో ఐదు అంతస్తుల భవనం ఏర్పాటు ప్రణాళికపై చర్చ జరిగింది.ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి డా. క్రిస్టినా చోంగ్తూ, ఆరోగ్య కమిషనర్ సంగీత సత్యానారాయణ, టి.జి.ఎమ్.ఎస్.ఐ.డి.సి. (తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్) ఎండీ ఫణీంద్ర రెడ్డి, ఆరోగ్యశ్రీ సిఇఒ ఉదయ్ కుమార్, హెూడీలు డా. రవీంద్రకుమార్, డా. అజయ్ కుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గాజా బాల్యం.. నిలువెల్లా గాయాలమయం!

విశ్వంభర, నేషనల్ బ్యూరోః చదువులు, ఆటపాటలతో సరదాగా సాగిపోవాల్సిన ‘గాజా’ బాల్యం.. యుద్ధరక్కసి కోరల్లో చిక్కుకుంది. హమాస్ అంతమే లక్ష్యంగా ఇజ్రాయెల్ చేపడుతున్న భీకర దాడులు చిన్నారుల భవిష్యత్తును చిదిమేస్తున్నాయి. నిలువెల్లా గాయాలను మిగుల్చుతున్నాయి. 2023 అక్టోబరు నుంచి ఇప్పటివరకు దాదాపు 21 వేలమంది గాజా చిన్నారులు దివ్యాంగులుగా మారినట్లు ‘దివ్యాంగుల హక్కులపై ఐరాస కమిటీ’ వెల్లడించింది. 40,500 మంది పిల్లలు యుద్ధ సంబంధిత గాయాల బారినపడినట్లు తెలిపింది.“ఇజ్రాయెల్ దాడుల్లో ఈ ఏడాది ఆగస్టు 21 వరకు దాదాపు 1.57 లక్షల మంది గాయపడ్డారు. వారిలో 25 శాతానికి శాశ్వత వైకల్య ప్రమాదం పొంచి ఉంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలామంది ఆహారం, తాగునీరు, పారిశుద్ధ్యం లేని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. వారిలో 83 శాతం మంది చక్రాల కుర్చీ, వాకర్ల వంటి సహాయక పరికరాలను కోల్పోయారు.

దీంతో ప్రమాదకర, అమానవీయ పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వస్తోంది. మానవతా సాయాన్ని అడ్డుకోవడమనేది వారి జీవితాలను మరింత దుర్భరం చేస్తోంది” అని ఐరాస కమిటీ పేర్కొంది. ఈ నేపథ్యంలో యుద్ధ ప్రభావిత దివ్యాంగులకు పెద్దఎత్తున మానవతా సాయం అందించాలని ఇజ్రాయెల్‌కు పిలుపునిచ్చింది. వారి రక్షణకు అవసరమైన



చర్యలు తీసుకోవాలని సూచించింది.గాజాలో లక్షలాది మంది ఆకలి బాధతో జీవన్మరణ పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. అమెరికా, ఇజ్రాయెల్ మద్దతు కలిగిన ‘గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్’ ఆధ్వర్యంలో నాలుగు కేంద్రాల ద్వారా సాయం పంపిణీ చేస్తున్నారు. అవి ఇజ్రాయెల్ మిలిటరీ జోన్లలో ఉన్నాయి. ఐరాస, మిగిలిన మానవతా గ్రూపుల నుంచి కొద్ది మొత్తంలో సాయం అందుతోంది.తీవ్ర తొక్కిసలాటలు చోటుచేసుకుంటున్నాయి. జీహెచ్ఎఫ్ కేంద్రాల వద్ద ప్రజలపై దాదాపుగా రోజూ కాల్పులు జరుగుతున్నాయి. ఈ కాల్పుల్లో ఇప్పటికే వందల మంది మరణించారు.

# పుతిన్‌తో భేటీ అనంతరం కిమ్ డీఎన్‌ఏను తుడిచేసిన సహాయకులు..!

విశ్వంభర, నేషనల్ బ్యూరోః


చైనా ఆయుధ ప్రదర్శనలో భాగంగా షీ జిన్‌పింగ్‌తో పాటు పాల్గొన్న రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. ఆ కార్యక్రమం తర్వాత పుతిన్–కిమ్ భేటీ అయ్యారు. అనంతరం చోటుచేసుకున్న నాటకీయ పరిణామాలు ఇప్పుడు నెట్టింట్లో వైరల్‌గా మారాయి. భేటీ అనంతరం పుతిన్–కిమ్ వెళ్లిపోగానే.. వారు కూర్చున్న ప్రదేశం వద్దకు వేగంగా ఇద్దరు వ్యక్తులు దూసుకొచ్చారు. ఒకరు కిమ్ కూర్చున్న కుర్చీని తెగ తుడిచేశారు. ఉ.కొరియా అధ్యక్షుడికి సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు లేకుండా శుభ్రం చేశారు. ఆయన తాకిన ఫర్నీచర్‌ను క్లీన్ చేశారు. ఇంకొకరు ఆయన వాడిన గ్లాస్ అతి జాగ్రత్తగా ట్రేలో పెట్టుకొని తీసుకెళ్లిపోయారు. ఆయనకు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు ఆ ప్రాంతంలో లేకుండా, ఆయన డీఎన్ఏ ఎవరికీ చిక్కకుండా ఉండేందుకు ఇలా వ్యవహరించారని రష్యా జర్నలిస్ట్ ఒకరు వెల్లడించారు. ఇప్పుడు దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తమ ఆరోగ్యానికి సంబంధించిన విషయాలు బయటకు చిక్కకుండా ప్రపంచ నేతలు జాగ్రత్తలు పాటిస్తుంటారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపుపై చర్చించేందుకు ఇటీవల అలాస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయిన సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్



ఇలాంటి జాగ్రత్తే తీసుకున్నారని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. పుతిన్ మల వ్యర్థాలను తీసుకెళ్లడానికి ప్రత్యేకంగా ఓ సూట్ కేసును ఆయన బాడీగార్డులు మోసుకెళ్లారట. ఆ పూప్ సూట్‌కేస్‌లో వాటిని సేకరిస్తారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

# మా వస్తువులపై భారత్ సుంకాలు ఎక్కువేః ట్రంప్

విశ్వంభర, నేషనల్ బ్యూరోః సుంకాలతో విరుచుకుపడుతోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తమ వస్తువులపై ఆయా దేశాలు అత్యధిక టారిఫ్‌లు విధిస్తున్నాయని విమర్శించారు. ఈ సందర్భంగా భారత్ సుంకాలతో తమని చంపేస్తోందంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. తమ వస్తువులపై సుంకాలు ఉండవని దిల్లీ అంగీకరించిందని చెప్పిన ఆయన.. భారత్ వస్తువులపై 50శాతం టారిఫ్‌లు విధించడాన్ని మరోసారి సమర్థించుకున్నారు.“మాపై పలు దేశాలు సుంకాలు విధించాయి. చైనా సుంకాలతో చంపేస్తోంది. టారిఫ్‌లతో భారత్ మమ్మల్ని చంపుతోంది. బ్రెజిల్ కూడా భారీ సుంకాలు విధిస్తోంది” అని ట్రంప్ పేర్కొన్నారు. స్కాట్ జెన్నింగ్స్ రేడియో షో ఇంటర్వ్యూ మాట్లాడిన ఆయన.. మరేదేశం అర్థం చేసుకోని విధంగా టారిఫ్‌ల గురించి తాను అర్థం చేసుకున్నానని చెప్పారు.“అందరికంటే ఎక్కువగా సుంకాల గురించి అర్థం చేసుకున్నా. నేను చేపట్టిన చర్యలతోనే ఆయా దేశాలు దిగివస్తున్నాయి.



ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధిస్తున్న దేశం భారత్. తమ వస్తువులపై సుంకాలు ఉండవని వాళ్లు నాకు చెప్పారు. నేను ఈ చర్యలు తీసుకోకుండా ఉంటే వాళ్లు దిగివచ్చేవారు కాదు.

# భయంలో "పెద్ద"సారు..

తెలంగాణ రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తుంటే కొన్ని దశాబ్దాలుగా తెలంగాణ రాష్ట్రాన్ని, ఇక్కడి ప్రాంతాన్ని శాసించిన, శాసిస్తున్న ఒక ప్రముఖ నేత, ఆ నేత పార్టీ, ఆ నేత కుటుంబం ఇప్పుడు వెన్నులో వణుకుతో ఉన్నట్లు తెలుస్తున్నది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రముఖుడు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు(కేసీఆర్) పార్టీ బీఆర్ఎస్, అతని కుటుంబంలో అంతర్గత కలహాలు ఇందుకు కారణంగా కనిపిస్తున్నాయి. తాజాగా బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెన్షన్ వేటుకు గురైన కేసీఆర్ కూతురు కవిత... ఆ పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. కొన్ని నెలలుగా బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలపై... రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ పంపడం, ఈ వ్యవహారంలో కవిత చేసిన ప్రకటనలు, ఆరోపణలు ఆమె రాజీనామాచేసే వరకు దారితీసాయి. వీటన్నింటి నేపథ్యాన్ని పరిశీలిస్తే... బీ ఆర్ఎస్ కారు పార్టీకి పెద్ద దిక్కు, అందరూ పెద్దసారుగా పిలుచుకునే కేసీఆర్ కూడా కొంత భయంలో ఉన్నాడా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఎటువంటి విపత్కర పరిస్థితులైనా అత్యంత చాకచక్యంగా, ధైర్యంగా ఎదుర్కొంటూ... ప్రత్యార్థులపై ఆధిపత్యాన్ని ప్రదర్శించే కేసీఆర్ కొద్ది రోజులుగా అందుకు భిన్నముగా వ్యవహరిస్తున్నట్లు తాజా రాజకీయ పరిస్థితులే చెబుతున్నాయి. తన సొంత కూతురు కవితను బీఆర్ఎస్ పార్టీకి దూరం చేసేలా సస్పెన్షన్ వేటు వేయక తప్పలేదు. ఈ విషయంలో ఆయన అంతర్మథనం చెందుతుండవచ్చు. కానీ, బయటికి ఏమి చెప్పుకోలేని స్థితి. పెద్ద సారుకు ఏమైంది? ఆయన ఎవరిని చూసి భయపడుతున్నారు? ఆ భయానికి గల కారణాలు ఏమిటి? ఇంతకీ అతనిని భయపెడుతున్న అంశాలు ఏమిటి? అతన్ని భయపెడుతున్నది ఎవరు? కారు పార్టీలో ఏం జరుగుతోంది? ఏం జరగబోతుంది? కారుకు గల నాలుగు చక్రాలలో ఒక చక్రం ఊడినందున ఆ కారు ముందుకు పయనిస్తుందా? మరింత మరమ్మతులకు గురై కారా?నా(గ్యారేజ్ )కు చేరుతుందా? ఇటువంటి ఎన్నో ప్రశ్నలు, ఎన్నో అనుమానాలు సామాన్యుల నుంచి రాజకీయ పండితుల వరకు అందరినీ తలచి వేస్తున్నాయి. ఇంతకీ ఏం జరిగింది? ఏం జరగబోతోంది? అన్నది ప్రతి ఒక్కరిలో తలెత్తుతున్న ప్రశ్న. కేసీఆర్ రాజకీయ జీవితము, ఉద్యమ ప్రస్థానము మరోసారి ప్రస్తావించుకోవాల్సిన అవసరం లేదు. రాష్ట్ర, దేశ ప్రజలకు అది సుపరిచితమే. తాజా రాజకీయ పరిణామాలే ఇప్పుడు చర్చించుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. మౌనంగానే అన్ని భరిస్తూ కొన్ని చర్యలు తీసుకుంటున్న కేసీఆర్ కొందరిని చూసి భయపడుతున్నారని తెలుస్తోంది. అందుకు కవిత చేసిన ప్రకటనలు, ఆరోపణలు ప్రత్యక్ష ఉదాహరణ. మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ రావులపై... కవిత నేరుగానే ఆరోపణలు చేశారు. ఇప్పటికే వారిపై ఉన్న అవినీతి మరకలకు మరింత సాక్షి భూతంగా నిలిచారు. పార్టీలో ముఖ్యులే అయినప్పటికీ హరీష్ రావు ఆమెకు స్వయాన మేన బావ, సంతోష్ రావు(పెద్దమ్మ/ చిన్నమ్మ కొడుకు) అన్న అవుతారు. ఆ ఇద్దరి వల్లే తనకు ఈ పరిస్థితి వచ్చిందంటూ కవిత తన గోడు వెళ్ళబోసుకున్నారు. అంతేకాదు, ఆ ఇరువురు వల్లనే తన తండ్రి కేసీఆర్, తన అన్న కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్)లకు రాజకీయంగా ప్రమాదం ఉందని వెల్లడించారు. కేసీఆర్ కేటీఆర్ లను... ఆ ఇరువురు బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లుగా పరోక్షంగా వెల్లడించారు. రాష్ట్రంలో జరిగిన అనేక అవినీతి కుంభకోణాలకు, అక్రమాలకు హరీష్, సంతోష్ లే కారణం అని కూడా వెల్లడించారు. కవిత ఆ ఇరువురిపై ఇంత స్పష్టంగా ఆరోపణలు చేస్తున్నా కూడా వాటిని పార్టీ ముఖ్య నేతలు ఎవరు పూర్తిగా ఖండించలేదు. అలాగని ఆమె చేసిన ఆరోపణలను సమర్థించనూ లేదు. కానీ, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న దృష్ట్యా ఆమెను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు బీఆర్ఎస్ నేతలు ఒక ప్రకటన విడుదల చేశారు. అధినేత కేసీఆర్ అనుమతితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం వెనక ఆయనపై తీవ్ర ఒత్తిడి ఉన్నదని.. హరీష్, సంతోషులపై ఆమె ఆరోపణలు చేశారు. తప్పు చేసిన ఎవరిపైనైనా చర్యలు తీసుకోవచ్చు. శిక్షించవచ్చు. అందులో విశేషమేమీ ఉండదు. అనేక పార్టీల్లో ఇది సహజమే. అలా సస్పెన్షన్ నకు గురైన వారు పార్టీకి శాశ్వతంగా దూరమైన వారు కొందరైతే... కొంతకాలం తర్వాత సస్పెన్షన్ ఎత్తివేస్తే తిరిగి పార్టీలో చేరిన వారు కూడా ఉన్నారు. ఇది మామూలుగా అన్ని రాజకీయ పార్టీలలో జరిగేదే.



కానీ, కవిత విషయంలోనే ఇది భిన్నం. కవిత స్వయాన కేసీఆర్ కూతురు. కేసీఆర్ పై ఎంతో ఒత్తిడి ఉంటే తప్ప ఆయన ఈ నిర్ణయానికి వచ్చి ఉండరు. అన్నది పరిశీలకుల భావన. ఇంతకీ ఏమిటా ఒత్తిడి? ఎందుకు ఆ భయం? అనే కోణంలో మరికొంత విశ్లేషణలోకి వెళదాం.కవిత చేసిన ఆరోపణలను మరొక్కసారి పరిశీలిద్దాం.. నిజామాబాద్ ఎంపీ స్థానంలో కవిత ఓటమికి కారణమయ్యాడు. కామారెడ్డిలో కేసీఆర్ ఓటమికి అతనే కారణం. 2018 శాసనసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు 25 మందికి.. పార్టీ ఇచ్చిన ఆర్థిక సహాయంతో పాటు హరీష్ రావు అదనంగా కూడా ఆర్థిక సహాయాన్ని అందించాడు. ఈ నిధులన్నీ కూడా కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి సంబంధించినవే. 2018 ఎన్నికలలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొంతమంది తన చేతిలో ఉండేందుకు, తద్వారా రాజకీయ చక్రం తిప్పేందుకు లేదా అత్యున్నత పదవి ఆశించేందుకు కారణమై ఉండవచ్చున్నది ఆరోపణ. ఇవి కొన్ని ఆరోపణలు మాత్రమే. ఇవన్నీ కూడా ప్రధానంగా హరీష్ రావుకు సంబంధించినవే. సంతోష్ రావు పైన కొన్ని ఆరోపణలు చేశారు. అందులో ముఖ్యమైనది సిరిసిల్ల నియోజకవర్గంలో ఇసుక మాఫియా ఒక దళితుడి హత్యకు కారణమైన సంఘటన. ఈ సంఘటనలోనే మరో అయిదుగురు దళిత యువకులను పోలీసులు తీవ్రంగా కొట్టేందుకు కారణం సంతోష్ రావు. సిరిసిల్ల అన్నది కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గం. హరీష్ రావు, సంతోష్ రావు లపై కవిత చేసిన ఆరోపణలలో ప్రధానమైనవి. బహుశా ఈ అంశాలే కేసీఆర్ భయానికి కారణం కావచ్చు. ఇప్పటికీ కూడా హరీష్, సంతోష్ రావులకు కేటీఆర్ బాసటగా నిలవడానికి కారణమై ఉండవచ్చు. అయితే ఇప్పుడేమిటి? అన్నదే ప్రశ్న. బీ ఆర్ఎస్ పార్టీ ఇప్పుడు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నది. పార్టీని ఎవరు ఎప్పుడు వీలుతారో అన్న భయం చొరబడినది. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అధికార కాంగ్రెస్ లోకి వరుస కట్టారు. సుప్రీంకోర్టు ఆదేశంతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ విచారణ జరుపుతున్నారు. ఈ అంశం ఇంకా ఎటు తేలలేదు. ఒకవేళ అనివార్య పరిస్థితుల్లో ఆ పది మందిపై స్పీకర్ అనర్హత వేటు వేస్తే ఉప ఎన్నికలు జరుగుతాయి. ఫిరాయింపుదారుల్లో ఒకరైన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మృతితో ఇప్పటికే ఉప ఎన్నిక అతి త్వరలో జరగనున్నది. స్పీకర్ నిర్ణయంతో మరికొంతమందిపై వేటు వేటు పడితే అక్కడ కూడా ఉప ఎన్నిక అనివార్యం. అంటే, ఉప ఎన్నికలు ఎదుర్కొనే సత్తా పార్టీకి ఉండాలి. అందుకు పార్టీలోని అగ్రశ్రేణి నాయకత్వం అందరూ బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. హరీష్ వంటి నేతలను దూరం చేసుకుంటే ఆ ప్రభావం ఉప ఎన్నికలపై పడుతుంది. ఇది ఒక కారణంగా చెప్పవచ్చు. ఇక, 25 మంది పార్టీ అభ్యర్థులకు హరీష్ రావు స్వతహాగా ఆర్థిక సహాయం చేశాడు అన్నది మరో ఆరోపణ. అందులో కొద్ది మంది అయినా గెలిచి ఉంటారు(కవిత పేర్లు చెప్పలేదు). వారందరూ లేరా అందులో కొందరు హరీష్ రావుకు వీర విధేయులుగా ఉన్నారని భావించుదాం. హరీష్ రావు పై ఎటువంటి చర్యలు తీసుకున్నా కూడా ఇప్పటికే ఫిరాయించిన పదిమంది ఎమ్మెల్యేలకు అదనంగా హరీష్ విధేయ ఎమ్మెల్యేలు వారికి జత కడతారు. ఇది పార్టీకి అత్యంత ప్రమాదకరం. బీఆర్ఎస్ పార్టీకి శాసనసభలో ఉన్న బలం 37 మాత్రమే. ఒకవేళ ఫిరాయింపుదారులపై స్పీకర్ ఎటువంటి చర్యలు తీసుకోలేదని అనుకుందాం. పార్టీ ఫిరాయింపుల చట్టం అనుసరించి మూడింట రెండు వంతుల మంది శాసనసభ్యులు పార్టీ నుంచి వేరు పడితే వారిని అసలైన పార్టీగా గుర్తిస్తారు. వారంతా ఏ పార్టీలో విలీనమైనా కూడా అభ్యంతరం ఉండదు. ఈ గణాంకాలు కూడా కేసీఆర్ లో భయానికి కారణం కావచ్చు. ఈ లెక్కన ప్రస్తుతం ఉన్న 37 మంది శాసనసభ్యుల్లో 26 మంది శాసనసభ్యులు ఒక గ్రూపుగా ఏర్పడితే... వారిని బీఆర్ఎస్ శాసనసభ పక్షంగా స్పీకర్ గుర్తించే వీలుంది. ఈ లెక్కన ఫిరాయింపు ఎమ్మెల్యేలకు... హరీష్ విధేయ శాసనసభ్యులు తోడైతే... వారిది అసలైన పార్టీ అవుతుంది. శాసనసభ పక్ష నేత అయ్యేందుకు హరీష్ రావుకు మార్గం అత్యంత సుగమం. లేదా వారందరూ కలిసి వారికి ఇష్టమైన పార్టీలో చేరవచ్చు. దీనితో ఇప్పుడు బీఆర్ఎస్ గా చేరుకుంటున్న పార్టీ లేదా వర్గం శాసనసభ్యుల బలం 13 లేదా అంతకు లోబడి ఉంటుంది. అలా ఉన్నవారు కూడా ఎంతకాలం ఉంటారో చెప్పలేము. ఇదంతా కూడా బీఆర్ఎస్ పార్టీ అస్తిత్వానికి సంబంధించినది. ఒక రకంగా పార్టీ అస్తిత్వమే ప్రమాదంలో పడుతుంది. అందుకే హరీష్ రావు, సంతోష్ రావుల ఒత్తిడికి కేసిఆర్ లొంగి ఉంటున్నారనే వాదన వినవస్తున్నది. పార్టీ అస్తిత్వము, తన భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతున్నదనే భావనతో కేటీఆర్ కూడా వ్యతిరేని పరిస్థితుల్లో హరీష్ కు బాసటగా నిలుస్తున్నారని చెప్పవచ్చు. ఈ కార్ రేస్, ఫోన్ టాపింగ్ తదితర కేసుల్లో కేటీఆర్ ఇప్పటికే విచారణ ఎదుర్కొంటున్నారు. మొత్తంగా కవిత చేసిన ఆరోపణలు కేసీఆర్ మౌనానికి, హరీష్ కు కేటీఆర్ బాసటగా నిలవడానికి కవిత చేసిన ఆరోపణల వాస్తవాలే కారణమై ఉంటాయని పెంచాల్సి ఉంటుంది. మొత్తంగా కారు పార్టీ, సారు పార్టీ అస్తిత్వము ప్రమాద స్థితిలో ఉన్నది అని చెప్పకనే చెప్పవచ్చు.



బాశెట్టి శ్రావణ్ కుమార్,
సీనియర్ జర్నలిస్ట్.
7207201154

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుడిది కీలక పాత్ర

**(రేపు సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా)**



భారత ప్రథమ రాష్ట్రపతి భారతరత్న ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణన్ పండితుడి జయంతి సందర్భంగాఈ అనంత సృష్టిలో మనిషి తన ఆశయ సాధనకై చేసే ప్రయత్నాన్ని వృత్తిగా భావించాలి. ఈనాడు వృత్తి, వ్యక్తి వేరువేరనే సంకుచితమైన అర్థాన్ని చెప్పడం అంత మంచిది కాదు. ఈ రెండింటికి అవినాభావ సంబంధము ఏర్పడాలి. అన్ని వృత్తులలో అధ్యాపక వృత్తి గొప్పదని పెద్దలంటూ ఉంటారు. వృత్తి ప్రాము ఖ్యతను బట్టి దాని గొప్పదనం తెలుస్తుంది. అయితే అన్ని వృత్తులలో ఉపాధ్యాయుడి(గురువు) బాధ్యత ఎంతో ఉన్నది. ఈ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుడి బాధ్యతను గురించి తెలుసుకుందాం! విద్యను బోధించే వ్యక్తిని అధ్యాపకుడు అంటారు. ఈ అధ్యాపకుడు అనే పదానికి ఎన్నో పర్యాయపదాలు ఉన్నాయి. అవి: ఉపాధ్యాయుడు, గురువు, ఒజ్జ, దేశికుడు, బడిపంతులు అనేవి సమానార్థాలు కలిగినవి. గురువు యొక్క ప్రతిపదార్థాన్ని బాగా ఆలోచిస్తే ఆధ్యాత్మిక వాదులు "అజ్ఞానమనే తిమిరాన్ని పారద్రోలేవాడు గురువు." అంటూ, నిర్వచనం చెప్పారు. ఇంకాస్త ముందుకు చూస్తే అతన్ని "గురుస్సాక్షాత్ పరబ్రహ్మ" అన్నారు. మానవుడు తన జీవన మార్గాన్ని విద్యతో సుగమం చేసుకొని లక్ష్యాన్ని చేరుకుంటాడు.

**ఉపాధ్యాయుడు అంటేనే సంచార గ్రంథాలయం...**

విద్య అంటే అ, ఆ, ఇ, ఈ లతో ప్రారంభమవుతుందని అనుకోవడం పెద్ద భ్రమే అవుతుంది. విద్య అనురాగముతో కూడిన అమ్మ చూపుతో, శభాష్ అనెడి తండ్రి తల ఊపుతో, అనుంగు సోదరి అల్లారు ముద్దుతో, తమ్ముని తాల్మితో, హరిత పుష్ప శోభితో, హస్త కమలములతో, పర్వత సానువుతో, పచ్చిక బయళ్ళతో, కోయిల కలికి పాటతో, మధుపముల మంజుల ధ్వనితో, మందమారుత మందార వృక్షచ్ఛాయా విహారము లతో, క్షమా శౌర్య గాథా కథన కంఠ మాధుర్యముతో, మధురమయ భావముతో, సచ్చిదానంద స్వరూప సాక్షాత్కారముతో, విద్య వెలసిల్లు తుంది. కాబట్టి పాండిత్యము కన్నా విచక్షణా జ్ఞానమే చాలా అవసరమై యున్నది. అటువంటి విచక్షణా జ్ఞానమును కలిగించువాడే ఉపాధ్యాయుడు. అటువంటి బోధన ఒక పవిత్ర ఆదర్శవంతమైన ధర్మకా ర్యము. ఉపాధ్యాయుడు విశ్వవిద్యాలయమునందు పఠించాడా? లేదా? అని చూడడం కన్నా.. అతడు ఒక జంగమరూపమైన విశ్వవిద్యాలయం అని భావించాల్సి ఉంటుంది. జన్మకు కారణభూతుడైన తండ్రి కంటే జ్ఞానవంతమైన మధురమైన జీవితమునకు కారణభూతుడైన గురుడే గురుడు. అతడే నిత్యవంద్యుడు. లోకవంద్యుడు. అందుకే మన ఋషులు గురువును (ఉపాధ్యాయుడిని) "ఆచార్య దేవో భవ!" అని పరమోన్నత స్థానము నందు కూర్చోబెట్టినారు.

**ఉపాధ్యాయుడికి ఉండవలసిన లక్షణాలు..**

ఈ అనంత విశ్వమే ఒక పాఠశాల. జీవిత పర్యంతం మనిషి పొందే ఆత్మానుభూతే విద్య. అందుకే మనవారు "అజరామవత్ ప్రాజ్ఞో విద్యామర్థంచ సాధయేత్" అన్నారు. రాబర్ట్ సన్ అను విద్యావంతుడు "ఇన్స్ట్రక్షన్ ఎండ్ ఇన్ ద స్కూల్ రూమ్. బట్ ఎడ్యుకేషన్ ఎండ్ ఓన్లీ విత్ లైఫ్." అన్నాడు. కాబట్టి ఈ సృష్టికి హేతుభూతుడగు భగవంతుని గూర్చి బోధించేవాడే ఉపాధ్యాయుడు. "కుంభినీదవు చెప్పేటి గురుడు గురుడు." అన్నాడు శ్రీమన్మహా భాగవతంలో పోతన మహాకవి. అటువంటి సర్వశక్తిమంతుడైన గురువు (ఉపాధ్యాయుడు) తన వృత్తిని "జన్మ జన్మల తపః ఫలితంగా" భావించాలి. నిష్ణాతుడైన ఉపాధ్యాయుడి దగ్గర పఠించే శిష్యుడు చక్కగా రాణించగలుగుతాడు. అతనికి ఉండవలసిన సుగుణాలను తెలుసుకుందాం. మన శరీరానికి ద్వాదశ(12) లక్షణాలు ఉన్న విధంగానే ఉపాధ్యాయునికి ద్వాదశ (12)లక్షణాలు ఉండాలి. 1) యమము, 2) అభినివేషము, 3) ఆర్ద్రత, 4) జీవిత నిర్వహణము నందు సంశోధనా పద్ధతి, 5) వృత్తి ధర్మము, 6) చాతుర్యము, 7) ధర్మ బుద్ధి (ధర్మ ప్రకోపము),8) మానసిక స్వాతంత్ర్యం, 9) నిష్కాపట్యము, 10) నెమ్మదిగా ఉండుట, 11) సహనము, 12) సమయస్ఫూర్తి.

**ఉపాధ్యాయుడు దైవాంశ సంభూతుడు..**

ఇటువంటి ద్వాదశ లక్షణ సమన్వితుడైన ఉపాధ్యాయుడు అతని వ్యక్తిత్వాన్ని గూర్చి ఆలోచించగా అతడు సర్వదా శిరోధార్యుడే కాగలడు. ఉపాధ్యాయుడి బోధ లేనిదే ఉన్నత స్థితి కలుగదు. గురువు లేని విద్య గుడ్డి విద్య అన్నారు పెద్దలు. ఆధ్యాత్మికత దృష్ట్యా ఆలోచించినా గురువు జీవిత మార్గదర్శకుడు. ఇటువంటి లక్షణాలతో ఉన్న ఉపాధ్యాయుడి వ్యక్తిత్వము రూపము ఆనాటిది. అందుకే సమర్థులైన పురుష సింహాలను తయారు చేసుకోగలిగాడు. ప్రజా బాహుళ్యమునందు ఆనాటి ఉపాధ్యాయుడు పరిపాలనా విధానమునకు సలహాదారుడు. పేరోలగమునందు ఆసీనుడైన ప్రభువు సైతము గురువు కబురంపగానే పరిగెత్తుకు రాగలిగాడు. బృహస్పతి, వాల్మీకి, వశిష్టుడు, విశ్వామిత్రుడు, శుకశౌనకాది మహామునులు అందరూ లోక ప్రసిద్ధులైన గురువులు వారందరూ దైవాంశ సంభూతులు. గురువు స్థానానికే వన్నె తెచ్చిన వారు. చక్కని ఆచార్యులు వారు.ఏ కాలంలోనైనా విద్య ఆయా కాలము యొక్క సమాజం యొక్క అవసరాలను బట్టి దేశకాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పటిష్ఠమైన ఆశయము కలిగి ఉంటుంది. అందువల్ల అటువంటి రూపమే గురువు ధరించి ఉంటాడు. మన పూర్వుల విద్యా దర్శనము జీవన సంశోధనాభివృద్ధి ఆధ్యాత్మిక మార్గము ఆనాటి సమాజానికి తపోనిష్ఠాగరిష్టతగల దేశికుడు అవసరమై ఉన్నాడు. ఆనాటి ఆచార్యునికి జీవిత భత్యము యొక్క ఆవశ్యకత లేకుండేది. ప్రభువులు, ధనవంతులు భూరి విరాళములను ఇచ్చి గురుకులములను పోషించేవారు ఆనాటి ధనవంతుడు గురుకులమునకు డబ్బు ధారపోయుంటే ఎంతో ఘనతగా భావించేవాడు. శిష్యులు వాడ వాడలా సంచరించి బిక్షలు తెచ్చేవారు. అందువలన ఆనాడు దేశికునకు వృత్తి వ్యామోహాలు లేవు. ఈతి బాధలు అసలు దరి చేరివే కావు.

**విద్య ద్వారానే సమగ్ర మనో వికాసం..**

కాల ప్రవాహంలో అనేకమార్పులు సహజమే కదా! ఆనాటి విద్యా ధర్మము ఆధ్యాత్మికమైన వృష్టి రూపము. ఆనాటి గురు శిష్య సమ్మేళనము అనురాగ రహితము. పరస్పరం ఘర్షణలకు తావుండేది. మానవ సంబంధాలు కూడా తక్కువగానే కనిపించేవి. ఆనాటి విద్యలో సమర్థులైన నాయకులు తయారయ్యే వారు. కానీ పరిపుష్టి గల సమాజము కాదు. కానీ రాను రాను విద్యా లక్ష్య ము మారుతూ వచ్చింది. ఆ వెంటనే ఉపాధ్యాయుడు కూడా మారుతూ వచ్చాడు. ఈనాటి ఉపాధ్యాయుడు బృహత్తరమైన సమాజమును నిర్మించవలసిన అవసరం ఉంది. కులవిద్య ఈనాడు జాతివిద్యగా రూపొంది జాతి విద్య అంతర్జాతీయతాక్రమ వికాసానికి దారి తీయాలి. దాని ఆశయము విశ్వ మానవ సంక్షేమము లేక సంక్షేమ రాజ్యా దర్శాలుగా ఉండాలి. అప్పుడే సమాజ సంక్షేమం రాజ్యసంక్షేమం నెరవేరుతాయి. ఈనాటి ఉపాధ్యాయుడు జాతి నిర్మాత అనే విశాలమైన అర్థమును కలిగి ఉన్నాడు. అందుకే ఈనాటి ఉపాధ్యాయుడు తనకు తెలిసింది మాత్రమే బోధించేవాడు కాదు. తెలియకపోతే తెలుసుకొని బోధించవలసిన అవసరం ఉంది. ధర్మ పరిపాలన ఆత్మ అభ్యున్నతికే కానీ పరుల ఉద్ధరణ కు కాదు. వృత్తి ధర్మాన్ని మరిస్తే ఒక్కొక్కసారి ఆత్మ పరిజ్ఞానం కూడా నశిస్తుంది. ఈనాటి ఉపాధ్యాయుడు ధర్మచ్యుతుడుగా మారడానికి ఎంత మాత్రమూ వీలు లేదు. నేటి పిల్లలు జీవన కుసుమాలు. కేవలం అలంకారం కోసం ప్రదర్శనగా ఉంచే పూలు కారు. జాతి జీవనమనే మహా వృక్షానికి వికసించిన పుష్పాలు వారు. దేశానికి పరిపుష్టిని ఇచ్చే ఫలాలుగా పరిణమించే పుష్పాలు. తోటమాలి ఫల వృక్షాలను ఎంత జాగ్రత్తగా పెంచుతాడో సమాజ జీవితాన్ని కూడా ఉపాధ్యాయుడు అంతే జాగ్రత్తగా పోషించాలి. తోటమాలి పాత్రను పోషించాలి ఉపాధ్యాయుడు. అప్పుడే ఈ సమాజంలో పిల్లలు వికసించిన కుసుమాలై ఫల పుష్పాలతో జీవితాలు ఫలవంతం చేసుకుంటారు సమాజానికి ఆదర్శనీయులవుతారు. సంఘానికి శక్తి స్వరూపులుగా రూపొందగలుగుతారు.

**నైతికతకు నిలువెత్తు నిదర్శనం ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణన్..**

ఇంతటి అమోఘ కృషికి సంకేతము ఉపాధ్యాయుడు. అతని మూర్తిమత్వము జాతికి ఆదర్శప్రాయము. నిరక్షరాస్యత ఈనాడు ఉండడానికి తావులేదు. ఈనాడు మనిషికి ఎన్నికల విధానము నవ సమాజ నిర్మాణం వికేంద్రీకరణ విధానము వాటి విలువలు తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఏర్పడిం ది. ప్రాతిపదిక విద్యకు ప్రాముఖ్యత ఇవ్వాలి. సమాజం నాగరికత స్థాయిని అందుకోగలగాలి. దేశంలో సమగ్ర ప్రగతి జరగాలంటే యావత్ దేశము దేశికుని విలువను గ్రహించాలి. గ్రహించే స్థాయిని ఉపాధ్యాయుడు కూడా కలిగి ఉండాలి. ఆ ప్రతిపత్తి కోసం భారత ప్రభుత్వం ఉపాధ్యాయుల సదస్సులను ఏర్పాటు చేసింది. ఈనాడే రాధాకృష్ణ పండితుని జన్మదినం కూడా. ఆచార్య రాధాకృష్ణులు భారత దేశపు సనాతన సనూతన విశిష్టత నొందిన జంగమరూపమైన విశ్వవిద్యాలయం వారు. ఒకానొకప్పుడు వారు దేశికులు. ఒకనాడు దేశానికి అధ్యక్షులు ఇది దేశకుల పాలిట మహద్భాగ్యమే అని చెప్పక తప్పదు. సలహాదారుడైన ఆచార్యుడే పరిపాలన అధ్యక్షుడు అవ్వటం నిజంగా భారతదేశానికి స్వర్ణ యుగమే! భారతీయుల జీవితాల్లో అమృత ఘడియలే! అని చెప్పక తప్పదు. ఈనాడు ఉపాధ్యాయుల ఎడ జరుగుతున్న నిర్దాక్షిణ్యత చెప్పనలవి కాకుండా ఉంది. పరిపాలనా యంత్రాంగం ఉపాధ్యాయుడిని కీలుబొమ్మగా భావించి ఎన్నో తగని విధులలో నియమించి ఉపాధ్యాయుని గౌరవానికి భంగం కలిగించడమే కాక ఉపాధ్యాయుడిని కీలుబొమ్మగా భావించడం దేశ భవిష్యత్తుకు ఎంతో ప్రమాదకరమైనది.


**విద్యారంగంలోని లోపాలను సరిదిద్దాలి..**

విద్యారంగంలో చాలా లోపాలు కనిపిస్తున్నాయి జాతీయ జీవన రంగాలలో అసంతృప్తికరంగా సాగుతున్నది విద్యా రంగమొకటి. ఉపాధ్యాయుని ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచటం, సాంఘిక ప్రతిపత్తిని పెంచటం ముఖ్యంగా మెరుగు పరచవలసినవి. ఉపాధ్యాయులు నాగరికతకే పునాదులు వేసే బాధ్యత గలవారు. గురువుల పట్ల భక్తి కలిగి ఉండాలనే ప్రాచీన సంప్రదాయం రాను రాను పటాపంచలై పోతుంది. పాశ్చాత్య భాషల పట్ల, సంస్కృతుల పట్ల ఫ్యాషన్ పేరుతో వ్యామోహాలను పెంచుకొని, స్వభాషలకు, స్వ సంస్కృతికి విఘాతం కల్పించడం పరిపాటి అయిపోయిం ది. ఇతర వృత్తులలో జీతాలు హెచ్చుగా ఉండటం వల్ల యువకులు ఉపాధ్యాయ వృత్తికి వైజ్ఞానిక పరిశోధనా రంగానికి మొగ్గు చూపటం లేదు. అందుకు ప్రభుత్వం బాగా ఆలోచించాలి. విద్యారంగానికి ప్రభుత్వం ఇతోధికమైన పెట్టుబడులు పెట్టాలి. ఆ పెట్టుబడలు ఏమీ వ్యర్థం కాదు. ఈ వాస్తవికతను ఎవ్వరూ కాదనలేరు. ఇలా ఉపేక్షించిన ఎడల జాతీయ జీవన రంగానికి పెను వినాశనం కలుగక మానదు. ఉపాధ్యాయుడు తెచ్చే మార్పు మనం చూసే సినిమాలో మార్పులా కనపడాలని భావించ రాదు. ఆశించరాదు. ఉపాధ్యాయుడు తెచ్చే మార్పు ఒక తరం వరకు కనిపించదేమో! కానీ అతని శక్తి తరతరాలు జాతిని నడిపిస్తుంది. ఈ విషయాలను ప్రభుత్వాలు ప్రజలు గమనించాలి. ఉపాధ్యాయుడి నిరాశ "పెంచిన పూల చెట్టు పూల నివ్వక ముళ్ళతో గుచ్చితే ఎలా ఉంటుందో ఉపాధ్యాయుడి నిరాశ కూడా జాతికి అదే విధంగా పరిణమిస్తుంది. ఈ విషయాలను ఫ్లిలందరూ గమనించాలి.ఆచార్య రాధాకృష్ణ పండితునకు అక్షరాంజలి ఘటిస్తూ..



చౌడూరి నరసింహారావు
సాహిత్య, సామాజిక విశ్లేషకులు
భాగ్యనగరం
9705100788

# ఆ జర్నలిస్టు సత్తె కాలపు సత్తెయ్యనే..




అని చెప్పడంలో ఎలాంటి సందేహా నికీ తావు లేదు. వెనకట సత్తె కాలం ఒకటి ఉండేదట. అప్పుడు అందరూ సత్యం మాత్రమే పలికేవారట. అని అనేక మంది భారతీయుల విశ్వాసం. ఇప్పుడు ఈ కలికాలంలో సత్యం పలికేవారు భూతద్దంతో దేశం అంతా వెదికినా ఒక్కడంటే ఒక్క సత్తెయ్య కూడా లభించ డు. అలాంటి ఈ కాలంలో ఎంసీ అనే పొడి అక్షరాలతో అత్యం త ప్రసిద్ధుడైన మానికొండ చలపతి రావు ఆదర్శ జర్నలిస్టు. స్వతంత్ర ఉద్యమ కాలం నుంచి తాను మరణించిన 1983 వరకు జర్నలిజమే జీవితంగా గడిపిన ఎంసీ గొప్ప జర్నలిస్టు. ఎక్కడో శ్రీకాకుళంలోని మారుమూల గ్రామంలో జన్మించి ఐదు దశాబ్దాల పాటు ఇంగ్లీష్ జర్నలిజంలో కొనసాగి వ్యక్తిగతంగా తనకంటూ ఏమీ మిగుల్చుకోని వ్యక్తి నిజంగా రత్నం లాంటి జర్నలిస్టే అవుతాడు. నెహ్రూ, ఇందిరాగాంధీలు ఆయనకు అత్యంత సన్నిహితులు. వారి కుటుంబ యాజమాన్యంలో నడిచిన నేషనల్ హెరాల్డ్ పత్రికలో 30 యేళ్లకు పైగా ఎడిటర్ గా పనిచేసి జర్నలిజానికే జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి నిజంగా అమర జీవి. తాను ఎడిటర్ గా పని చేసిన పత్రిక యజమాని నెహ్రూతో అనేక విషయాల్లో పూర్తిగా విభేదించి కూడా జర్న లిస్టుగా కొనసాగగలగడం అత్యం త కష్టసాధ్యమైన పని అనే చెప్పాలి. జీతం పెంచమని యాజమాన్యాలతో పోరాడే కాలంలో ...జీతం ఎంత పెంచాలి అంటే, నాకు అక్కర్లేదు నన్ను చెడ గొట్టకండి అని బదులిచ్చిన వ్యక్తిని సత్తె కాలపు సత్తెయ్య అని మాత్రమే పిలవాలి కదా. కుష్వంత్ సింగ్, కోటంరాజు రామారావు, చక్రవర్తుల రాఘవా చారి లాంటి ప్రసిద్ధ జర్నలిస్టులే ఆయనకు కితాబులు ఇచ్చారంటే ఆయన ఎంత ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన వాడో లెక్క వేసుకోవాలి. నెహ్రూతో అనేక విషయాల్లో పూర్తిగా విభేదించిన నేత ఎన్జీ రంగానే ప్రశంసల వర్షం కురిపించారు అంటే ఎంసీ ఎంత ఉన్నతమైన, అరుదైన వ్యక్తి అనేది గుర్తించాలి. ఆయన గురించి చెప్పమని అడిగితే ఆయనను తూ.చ.గలిగిన తూనిక రాళ్లు తన వద్ద లేవని పలువురు చెప్పడం ఎంసీ ఔన్నత్యానికి నిదర్శనం. చిన్న రాతకే సత్కారాలు, బిరుదుల కోసం వెంపర్లాడే ఈ కాలంలో తనకు ఇచ్చిన పద్మ విభూషణ్ బిరుదును సైతం తిరస్కరించిన అరుదైన జర్నలిస్టు. ఢిల్లీలో అత్యంత ఖరీదైన ప్రాంతం చాణక్యపురిలో తనకు ఇవ్వ జూపిన విలువైన ఇంటి స్థలాన్ని తిరస్కరించిన గొప్ప వ్యక్తి ఎంసీ .దేశంలో జర్నలిజం నేడు ఒక వృత్తిగా స్థిరపడడానికి ఆయన ఎనలేని కృషి చేశారు. ప్రెస్ కమిషన్, ప్రెస్ కౌన్సిల్, జర్నలిస్టుల కోసం తొలి వేజ్ బోర్డ్ వేయించడంలో అత్యధిక కృషి ఎంసీదే.జర్నలిస్టులు నేడు పొందు తున్న అనేక హక్కులు, రాయితీలు, గౌరవాలు ఎంసీ కృషి ఫలితమే. జీవిత కాలంలో కనీసం ఒక్క రీఫిల్ తో రాయ గలిగిన రాతలు కూడా రాయకుండా, పెద్ద జర్నలి స్టులుగా, జర్నలిస్టు ఉద్యమ నాయకులుగా చలామ ణి అవుతున్న ఈ కాలంలో ఎంసీని గుర్తు చేసుకోవడం అత్యంత అవసరం. అనివార్యం. ఇది ఎంసీ కోసం చేస్తున్న భజన కాదు. స్తోత్ర పాఠం అసలే కాదు. అన్నీ సత్యాలే. వీటిలో ఒక్క అతిశయోక్తి కూడా లేదు. ఇవేవి నేను కనుగొన్న విషయాలు కాదు. నేను ఆయన గురించి కొన్ని విషయాలు మాత్రమే విన్నాను.ఎంసీ గురించి నాకు పూర్తిగా తెలియదు. ఎప్పుడో 41 యేళ్లక్రితం మరణించిన దేశం గర్వించదగ్గ అరుదైన గొప్ప నిన్నటి తరం జర్నలిస్టు ఎంసీ జీవిత విశేషాలను ఎంతో శ్రమించి, సేకరించిన సంగతులను పుస్తక సంకలనంగా మనకు అందించిన మన జర్నలిస్ట్ ఆకుల అమరయ్య ఖచ్చితంగా అభినందనీయులు. అమరజీవి ఎంసీని అమరయ్య ధృవ తారగా పేర్కొన్నారు.అది ఎంత మాత్రం అతిశయోక్తి కాదు.



- గంటి గోవర్ధన్,
ప్రత్యేక ప్రతినిధి, విశ్వంభర దినపత్రిక
ఫోన్ : 9347056621

# భారత్, సౌత్ కొరియా మ్యాచ్ డ్రా

హాకీ ఆసియా కప్‌లో భారత్ జోరుకు చిన్న బ్రేక్ పడింది. బుధవారం జరిగిన సూపర్ 4 మ్యాచ్‌లో సౌత్ కొరియా చేతిలో తృటిలో ఓటమి నుంచి బయటపడింది. డిఫెండింగ్ చాంపియన్‌తో 2-2తో భారత్ డ్రా చేసుకుంది. గ్రూపు దశలో భారత జట్టు మూడు విజయాలతో అజేయంగా నిలిచిన విషయం తెలిసిందే. బలమైన సౌత్ కొరియా జట్టుతో పోరు అంత సులభంగా ఉండదని భారత్‌కు తెలుసు. అనుకున్నట్టే తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అయితే, మ్యాచ్‌లో భారత్‌దే ఆరంభం. 8వ నిమిషంలో హార్దిక్ గోల్ చేసి జట్టుకు శుభారంభం అందించాడు. కానీ, ఆ తర్వాత సౌత్ కొరియా దూకుడు పెంచింది. యాంగ్ వరుగా 12వ నిమిషంలో, 14వ నిమిషంలో రెండు గోల్స్ చేశాడు. దీంతో ప్రత్యర్థి 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. అలాగే, అద్భుతమైన డిఫెన్స్‌తో చాలా సేపు భారత్‌ను నిలువరించింది. టీమిండియాకు ఓటమి తప్పదేమో అనిపించింది. మరో 7 నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా మన్‌దీప్ జట్టును ఆదుకున్నాడు. 53వ నిమిషంలో గోల్ చేసి స్కోర్‌ను 2-2తో సమం చేశాడు. ఇక,



మిగతా సమయంలో ఏ జట్టు గోల్ చేయకపోవడంతో మ్యాచ్ డ్రా అయ్యింది. నేడు రెండో సూపర్ 4 మ్యాచ్‌లో మలేసియాతో భారత్ తలపడనుంది. ఫైనల్ ఆశలు సంక్లిష్టం కాకుండా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో భారత్ నెగ్గాల్సిందే.

# బెంగళూరు తొక్కిసలాటపై ఎమోషనల్ అయిన కోహ్లి.. సోషల్ మీడియాలో పోస్టు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) ఐపీఎల్ విజయోత్సవాలు విషాదంగా మారిన విషయం తెలిసిందే. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జూన్ 4న చోటుచేసుకున్న తొక్కిసలాటలో 11 మంది మరణించారు. ఈ ఘటనపై ఆర్సీబీ స్టార్ ప్లేయర్, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి స్పందించాడు. ఆర్సీబీ ఎక్స్ ఖాతా నుంచి ఎమోషనల్ పోస్టు పెట్టాడు. తమ ఫ్రాంచైజీకి అత్యంత సంతోషకరమైన క్షణాలు విషాదంగా మారాయని ఆవేదన చెందాడు. 'జూన్ 4న జరిగిన హృదయ విదారక ఘటన జీవితంలో జరుగుతుందని అనుకోలేం. మా ఫ్రాంచైజీ చరిత్రలోనే అత్యంత సంతోషకరమైన క్షణాలు అవి. విషాదంగా మారాయి. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాల కోసం, గాయపడిన మా అభిమానుల కోసమే నేను ఆలోచిస్తున్నా. ప్రార్థిస్తున్నా. మీకు జరిగిన నష్టం మాలో భాగం. ఇకపై మరింత జాగ్రత్తగా, గౌరవంగా, బాధ్యతతో కలిసికట్టుగా ముందుకు సాగుతాం.'అని కోహ్లి తెలిపాడు. కాగా, ఇటీవల ఆర్సీబీ ఫ్రాంచైజీ ఆర్సీబీ



కేర్ ద్వారా మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున అందజేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

# సత్తాచాటుతున్న అక్షయ, అన్విత్





హైదరాబాద్, : ప్రతిభకు పట్టుదల తోడైతే అద్భుతాలు సాధించవచ్చని నిరూపిస్తున్నారు ఈ చిచ్చర పిడుగులు. తాము ఎంచుకున్న ఆటలో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్న ఆకాంక్షతో ముందుకు సాగుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన అక్షయరెడ్డి, అన్విత్ బరిలోకి దిగిన ప్రతీ టోర్నీలో పతకాలతో సత్తాచాటుతూ ఔరా అనిపించుకుంటున్నారు. ఇటీవల కొచ్చి(కేరళ) వేదికగా జరిగిన సీఐఎస్‌సీఈ ఆర్చరీ జాతీయ టోర్నీలో అక్షయరెడ్డి బాలికల అండర్-14 విభాగంలో స్వర్ణం సహా ఓవరాల్‌గా రజతం దక్కించుకుంది. ప్రస్తుతం బండి స్వామి, గంగరాజు దగ్గర శిక్షణ తీసుకుంటున్న అక్షయ 8 ఏండ్ల వయసులోనే ఆర్చరీ కెరీర్ మొదలుపెట్టింది. ఆరు టోర్నీల్లో తనదైన ప్రతిభ కనబరుస్తూ టాప్-3లో నిలిచి ఆకట్టుకుంది. మరోవైపు అన్విత్ పిట్ట కొంచెం కూత ఘనమని నిరూపిస్తున్నాడు. డెహ్రాడూన్‌లో జరిగిన ఏషియన్ ఓపెన్ షార్ట్ ట్రాక్‌స్పీడ్ స్కేటింగ్‌లో 11 ఏండ్ల అన్విత్..రజతం (333మీ), కాంస్యం (500మీ)తో అదరగొట్టాడు. స్కేటింగ్‌లో రివ్వున దూసుకెళుతున్న అన్విత్ ఏనిమిదేండ్ల ప్రాయంలోనే రింక్‌లో అడుగుపెట్టాడు. నిరంతర సాధనతో అంచలంచెలుగా రాణిస్తూ ఇప్పటి వరకు రాష్ట్ర, జాతీయ టోర్నీల్లో 40కి పైగా పతకాలు కొల్లగొట్టి భవిష్యత్ ఆశాకిరణంలా కనిపిస్తున్నాడు.

# సత్తాచాటాలని.. నేటి నుంచి వరల్డ్ బాక్సింగ్ టోర్నీ

న్యూఢిల్లీ: లివర్‌పూల్ వేదికగా ప్రతిష్టాత్మక వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీకి గురువారం తెరలేవనుంది. ఈనెల 14వ తేదీ వరకు జరుగనున్న టోర్నీలో ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి స్టార్ బాక్సర్లు బరిలోకి దిగుతున్నారు. ఇటీవల బ్రెజిల్, కజకిస్థాన్‌లో జరిగిన వేర్వేరు వరల్డ్ బాక్సింగ్ కప్ టోర్నీల్లో 17 పతకాలతో సత్తాచాటిన భారత బాక్సర్లు అదరగొట్టాలని చూస్తున్నారు. రెండు సార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్(51కి)తో పాటు ఒలింపిక్ కాంస్య విజేత లవ్లీనా బొర్గోహై(75కి) తమ పంచ్ పవర్ చూపెట్టేందుకు సై అంటున్నారు. వీరికి తోడు హితేశ్(70కి), అభినాశ్(65కి), నుపూర్(80కి), పూజరాణి(80కి), మీనాక్షి(48కి), సాక్షి(54కి), జాస్మిన్(57కి), సంజు(60కి), సనామచా చాను(70కి) పోటీకి దిగుతున్నారు. రాజ్‌గిర్(బీహార్): ప్రతిష్టాత్మక ఆసియా కప్ హాకీలో భారత్ మెరుగైన ప్రదర్శన కొనసాగుతున్నది. ప్రపంచకప్ టోర్నీ బెర్తు దక్కించుకోవాలని పట్టుదలతో ఉన్న భారత్ అందుకు తగ్గట్లు ముందుకు సాగుతున్నది. బుధవారం టీమ్‌ఇండియా, కొరియా మధ్య సూపర్-4 పోరు 2-2తో డ్రాగా ముగిసింది. మూడో క్వార్టర్ వరకు 1-2తో వెనుకంజలో కొనసాగిన భారత్..ఆఖరిదైన నాలుగో క్వార్టర్‌లో అద్భుతంగా పుంజుకుని మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. భారత్ తరఫున హార్దిక్‌సింగ్(7ని), మన్‌దీప్‌సింగ్(52ని) ఒక్కో గోల్ చేశారు. మరోవైపు కొరియాకు జిహున్ యాంగ్ (11ని), కిమ్ యుహాన్ హాంగ్(13ని) గోల్స్ అందించారు. ఈ డ్రాతో భారత్ ప్రస్తుతం ఒక పాయింట్‌తో రెండో స్థానంలో ఉంది.



## కోలుకున్న స్టాక్ మార్కెట్లుసెన్సెక్స్




ముంబై, సెప్టెంబర్ 3: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. మెటల్, జీఎస్టీ రేట్ల తగ్గింపుపై కౌన్సిల్ సమావేశం ప్రారంభం కావడం మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఫలితంగా ఒక దశలో 700 పాయింట్ల వరకు లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 409.83 పాయింట్లు అందుకొని 80,567.71 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 135.45 పాయింట్లు అందుకొని 24,715.05 వద్ద స్థిరపడింది. మార్కెట్లో టాటా స్టీల్ 5.90 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటీసీ, ఎటర్నల్, ఎస్బీఐ, ట్రెంట్, టాటా మోటర్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సన్‌ఫార్మా, కొటక్ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, బీఈఎల్, మారుతి, రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, ఇన్ఫోసిస్, ఎన్‌టీపీసీ, హెచ్‌యూఎల్, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. అత్యధికంగా మెటల్ రంగ సూచీ 3.08 శాతం ఎగబాకింది. దీంతోపాటు కమోడిటీస్ 1.53 శాతం, హెల్త్‌కేర్ 1.20 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్, ఆర్థిక సేవలు, బ్యాంకింగ్, వాహన రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది. ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లు నష్టపోయాయి.

## మారుతి సరికొత్త 'విక్టోరిస్'

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ..దేశీయ మార్కెట్లోకి సరికొత్త విక్టోరిస్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మధ్యస్థాయి ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నయా మాడల్‌ను ప్రవేశపెట్టినట్టు కంపెనీ ఎండీ, సీఈవో హిసాచీ టకెచి తెలిపారు. ప్రస్తుతం సంస్థ ఫ్రాంక్స్, బ్రెజ్జా, జిమ్నీ, గ్రాండ్ విటారా మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్న విషయం తెలిసిందే. గడిచిన నాలుగేండ్ల కాలంలో కంపెనీ మొత్తం విక్రయాల్లో ఎస్‌యూవీ వాటా మూడింతలు పెరిగి 8.9 శాతం నుంచి 28 శాతానికి ఎగబాకిందన్నారు. ఈ నేపథ్యంలో ఎంట్రీ-ఎస్‌యూవీని ప్రవేశపెట్టినట్టు చెప్పారు. హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్, హోండా ఎలివేట్‌లకు పోటీగా సంస్థ ఈ నూతన మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారు ధర సంస్థ వెల్లడించలేదు. అయినప్పటికీ ఈ కారును తీర్చిదిద్దడానికి రూ.1,240 కోట్ల మేర పెట్టుబడి పెటినట్టు ప్రకటించింది.




# వ్యక్తిగత బీమాపై నో జీఎస్టీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3: కొత్త వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానం త్వరలో అమల్లోకి రాబోతున్నది. ఇప్పుడున్న 4 స్లాబుల్లో ఇక 2 స్లాబులే మిగిలి ఉండనున్నాయి. ఈ నెల 22 నుంచి మారిన స్లాబుల ప్రకారం ఆయా వస్తూత్పత్తులపై నూతన పన్ను రేట్లు వర్తించనున్నాయని బుధవారం ఇక్కడ జీఎస్టీ కౌన్సిల్ భేటీ అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. కాగా, స్లాబుల తగ్గనున్న నిత్యావసరాలు, వాహన ధరలు కుదింపునకు సమావేశంలో రాష్ట్రాలు అంగీకరించినట్టు చెప్పారు. దీంతో దేశవ్యాప్తంగా మారిన జీఎస్టీ రేట్లే చలామణిలో ఉంటాయన్నారు. చాలావరకు నిత్యావసరాలపై పన్నుల భారం తగ్గిందని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత జీవిత, ఆరోగ్య బీమాలపై పన్ను ఎత్తివేసినట్టు తెలిపారు. దీంతో ఆయా పాలసీదారులపై ప్రీమియం భారం తగ్గనున్నది. మరికొన్ని నిత్యావసరాలపైనా జీఎస్టీ మినహాయింపునిచ్చినట్టు వివరించారు. అంతేగాక విద్యార్థుల కోసం పెన్సిల్ షార్ప్‌నర్లు, మ్యాప్‌లు, ఎరేజర్లు, ఎక్సర్‌సైజ్ బుక్‌లపై పన్నును తీసేశారు. అలాగే ఈవీలపై 5 శాతం జీఎస్టీ ఉంటుందన్నారు. అయితే సిగరెట్లు సహా ఇతర పొగాకు ఉత్పత్తులపై ఎప్పట్లాగే 28 శాతం జీఎస్టీ, నష్టపరిహార సెస్సు పడుతుందని మంత్రి స్పష్టం చేశారు. కరోనా దృష్ట్యా జీఎస్టీ చెల్లింపుల కోసం తెచ్చిన రుణాలు తీరేంత వరకు ఇంతేనని తేల్చిచెప్పారు. ఆ తర్వాత కొత్త పన్నులు వర్తిస్తాయన్నారు. మారిన విధానంతో రెవిన్యూ నష్టం రూ.48,000 కోట్లు అని వెల్లడించారు. ఇదిలావుంటే జీఎస్టీ సంస్కరణలతో దేశ ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయన్న ఆశాభావాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కనబర్చారు. అలాగే వ్యాపార నిర్వహణ, ముఖ్యంగా చిరు వ్యాపారులకు లాభం చేకూరుతుందన్నారు. అమెరికా సుంకాలతో ప్రభావితమైన దేశ ఆర్థిక వ్యవస్థకు జీఎస్టీ భారం తగ్గింపుతో కొత్త జోష్ రాగలదన్నారు. ప్రస్తుతం జీఎస్టీ ప్రధాన స్లాబులు నాలుగున్నాయి. అయితే వీటిని రెండుకు తగ్గిస్తామని పంద్రాగస్టు ప్రసంగంలో ప్రధాని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగా తాజా జీఎస్టీ మండలి సమావేశంలో నిర్ణయాలు వెలువడ్డాయి. కాగా, ఇప్పుడున్న 5, 12, 18, 28 శాతం




స్లాబుల్లో 12, 28 శాతం స్లాబులను తీసేశారు. ఈ క్రమంలోనే 12 శాతం జీఎస్టీని ఎదుర్కొంటున్న 99 శాతం వస్తూత్పత్తులను 5 శాతంలోకి, 28 శాతం పన్ను పడుతున్న వాటిలో 90 శాతం వస్తూత్పత్తులను 18 శాతంలోకి తెచ్చినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇక ప్రత్యేకంగా 40 శాతం స్లాబును ఏర్పాటు చేయగా, ఇందులో 6-7 వస్తూత్పత్తులే ఉంటున్నాయి. వీటిలో పొగాకు, పాన్ మసాలా, లగ్జరీ బైకులు, కార్లు మొదలైన వాటిని ఉంచుతున్నారు. జీఎస్టీ స్లాబుల కుదింపు నేపథ్యంలో బీజేపీ, దాని మిత్రపక్షాలేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేశాయి. జీఎస్టీతో ఇప్పటికే పన్ను ఆదాయాన్ని కోల్పోయామని, ఇప్పుడు స్లాబులను తగ్గించి మరింతగా నష్టపరుస్తున్నారని తెలంగాణ సహా పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, జార?ండ్, కర్ణాటక, పంజాబ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు అభ్యంతరాలను వెలిబుచ్చాయి. అందుకే నష్టపరిహార సెస్సుపై స్పష్టత కావాలని డిమాండ్ చేస్తున్నాయి. 40 శాతంపై విధించే ఏ లెవీ రాబడినైనా ఆదాయాన్ని నష్టపోతున్న రాష్ట్రాలకే చెందేలా చూడాలని పశ్చిమ బెంగాల్ అన్నది. కాగా, ఆయా కేంద్ర, రాష్ట్ర పన్నులను కలిపి 2017 జూలై 1న దేశవ్యాప్తంగా జీఎస్టీని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. దీంతో నష్టపోతున్న రాష్ట్రాల కోసం ఐదేండ్లు నష్టపరిహార సెస్సును అమలు చేశారు. అయితే 2022 జూన్‌లో మళ్లీ 2026 మార్చి 31దాకా పొడిగించారు.

# ఎస్బీఐ క్రెడిట్ కార్డుతో సహా మారేవి ఇవే

సెప్టెంబర్ నెల వచ్చేసింది. ప్రతి నెల మాదిరిగానే ఈ నెలలో కూడా కొన్ని రూల్స్ మారనున్నాయి. సెప్టెంబర్‌లో, ఆధార్ కార్డ్ అప్‌డేట్, ఐటీఆర్, యూపీఎస్ క్రెడిట్ కార్డ్ నియమాలలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. అలాగే, ప్రతి నెలలాగే, గ్యాస్ ధరలు కూడా ప్రభావితం కావచ్చు. జెట్ ఇంధనం, ధరలో మార్పు ఉండవచ్చు. ఈ మార్పులు సామాన్యుడి జేబుపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. మరి నేటి నుంచి ఏవేం మారనున్నాయో ఇప్పుడు చూద్దాం. ఈసారి ఆదాయపు పన్ను శాఖ ఐటీఆర్ దాఖలు చేయడానికి చివరి తేదీని జూలై 30 నుంచి సెప్టెంబర్ 15, 2025 వరకు పొడిగించింది. దీని కారణంగా పన్ను చెల్లింపుదారులకు రిటర్న్ దాఖలు చేయడానికి అదనపు సమయం లభించింది. అయితే సెప్టెంబర్ 15 లోపు ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. లేకపోతే మీకు నోటీసు రావచ్చు. జాతీయ పెన్షన్ వ్యవస్థ కిందకు వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఏకీకృత పెన్షన్ పథకంఎంచుకోవడానికి సెప్టెంబర్ 30 వరకు సమయం ఉంది. ముందుగా ఈ తేదీ జూన్ 30, కానీ తరువాత దానిని సెప్టెంబర్ 30 వరకు పొడిగించారు. ఇది ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రారంభించబడిన పెన్షన్ పథకం. పోస్ట్ డిపార్ట్మెంట్ సెప్టెంబర్ 1, 2025 నుంచి దేశీయ పోస్టల్ సర్వీస్‌ను స్పీడ్ పోస్ట్ సర్వీస్‌తో విలీనం చేస్తోంది. అంటే ఇప్పుడు ఏదైనా సాధారణ పోస్ట్ ద్వారా కాకుండా స్పీడ్ పోస్ట్ ద్వారా మాత్రమే పంపించాల్సి ఉంటుంది. కాబట్టి మీరు సెప్టెంబర్ 1 నుంచి దేశంలోని ఇండియా పోస్ట్ ద్వారా ఏదైనా రిజిస్టర్డ్ పోస్ట్ పంపితే, అది స్పీడ్ పోస్ట్ డెలివరీ అవుతుంది.

క్రెడిట్ కార్డ్ సెప్టెంబర్ 1, 2025 నుంచి ఎంపిక చేసిన కార్డుల నియమాలలో మార్పులను ప్రకటించింది. కొన్ని కార్డులకు రివార్డ్ పాయింట్ల ప్రోగ్రామ్‌ను సవరించింది. ఈ సవరణతో, అటువంటి కార్డులను కలిగి ఉన్న కస్టమర్‌లు డిజిటల్ గేమింగ్, ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో లావాదేవీలకు సంబంధించిన ఖర్చులపై రివార్డ్ పాయింట్లను సంపాదించలేరు. ఇండియన్ బ్యాంక్, %×ణదీ×% బ్యాంక్ వంటి బ్యాంకులు ప్రస్తుతం కొన్ని ప్రత్యేక కాలపరిమితి %ఖీణ%లను నిర్వహిస్తున్నాయి.




## దక్షిణ మధ్య రైల్వే ఆదాయంలో రికార్డు




హైదరాబాద్, : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఈసారి కూడా మెరుగైన ఆదాయాన్ని ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రూ.8,593 కోట్ల స్థూల ఆదాయాన్ని నమోదు చేసుకున్నది. క్రితం ఏడాది ఇదే సమయంలో ఆర్జించిన దాంతో పోలిస్తే రూ.136 కోట్లు అదనంగా సమకూరినట్టు బుధవారం రైల్వే జోన్ అధికారులు వెల్లడించారు. ఇందులో సరుకు రవాణా ద్వారా అత్యధికంగా రూ.5,634 కోట్లు ఆదాయం నమోదైంది. గతేడాది కంటే ఈ సారి 6.7 శాతం అదనంగా సమకూరింది. అలాగే ప్రయాణికుల ద్వారా రూ.2500 కోట్లు ఆదాయం నమోదు కాగా, ఇతర మార్గాల ద్వారా రూ.459 కోట్లు ఆదాయం నమోదైనట్టు వారు ప్రకటించారు. హైదరాబాద్, సెప్టెంబర్ 3: హైదరాబాద్ నుంచి ఆమ్‌స్టర్డమ్ మధ్య డైరెక్ట్ విమాన సర్వీసును ప్రారంభించింది కేఎల్‌ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్. ఇప్పటికే బెంగళూరు, ఢిల్లీ, ముంబైల నుంచి నేరుగా విమాన సర్వీసును అందిస్తున్న సంస్థ..నాలుగో నగరంగా హైదరాబాద్ నిలిచిందని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి మార్టిన్ స్టీనెన్ తెలిపారు. ఫార్మా హబ్‌గా కొనసాగుతున్న హైదరాబాద్ నుంచి నేరుగా విమాన సర్వీసును ప్రారంభించడంతో ఇరు నగరాల మధ్య రాకపోకలు పెరగడంతోపాటు ఎగుమతులు కూడా పుంజుకోనున్నాయన్నారు. ప్రస్తుతం భారత్‌కు వారంలో 22 విమాన సర్వీసులు నడుపుతున్న సంస్థ..ఈ ఏడాది చివరినాటికి ఈ సంఖ్యను 27కి పెంచుకోనున్నట్టు ప్రకటించారు.

## భారీ ఆఫర్లతో అమెజాన్, ఫ్లిఫ్ కార్ట్ ఫెస్టివల్ సేల్

పండగ సీజన్ రానుండడంతో అమెజాన్, ఫ్లిప్ కార్ట్ వంటి కంపెనీలు కస్టమర్ల కోసం భారీగా ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సేల్ తో పాటు ఫ్లిప్ కార్ట్ బిలియన్ డేస్ సేల్ తొందర్లోనే ప్రారంభం కానున్నట్లు సంస్థ యాజమాన్యాలు వెల్లడించాయి. ఫోన్లు, ల్యాప్ ట్యాప్ లు టీవీలు.. ఫర్నిచర్ లలో భారీగా డిస్కౌంట్లు ఇవ్వనున్నారు. అమెజాన్ తన ఫెస్టివల్ సేల్ ను త్వరలో ప్రారంభించ నుంది. సేల్స్ లో యాపిల్, శాంసంగ్ వంటి తదితర స్మార్ట్ ఫోన్లు 40శాతం వరకు డిస్కౌంట్ తో లభించనున్నాయి. మిగిలిన కంపెనీలు కూడా 65 శాతం అంటే కొన్ని వస్తువులపై మాత్రమే డిస్కౌంట్లు ఇస్తున్నాయి. ఎస్ బీఐ డెబిట్, క్రెడిట్ కార్డులపై 10శాతం వెంటనే రాయితీ ఇవ్వనున్నాయి. అమెజాన్ పే లెటర్ కస్టమర్లకు రూ.600 రివార్డ్స్ అందించనుంది. ఫ్లిప్ కార్ట్ యాక్సిక్, ఐసీఐసీఐ బ్యాంక్ లతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ బ్యాంక్ క్రెడిట్ కార్డులు, ఈఎంఐ ట్రాన్సాక్షన్ లపై 10 శాతం రాయితీ ఇవ్వనున్నాయి. రెండు దిగ్గజ సంస్థలు భారీ ఆఫర్లతో వినియోగదారుల ముందుకు రానున్నాయి. ఈ పండగ సీజన్ లో అమెజాన్, ఫ్లిప్ కార్డ్ ల మధ్య గట్టి పోటీ ఏర్పడనుంది.

# అఖండ 2 సస్పెన్స్ తీరేది ఎప్పుడు..?




నందమూరి బాలకృష్ణ బోయపాటి శ్రీను కాంబినేషన్ లో వస్తున్న అఖండ 2 సినిమా అసలైతే సెప్టెంబర్ 25న రిలీజ్ లాక్ చేసుకున్నారు. టీజర్ తోనే సినిమాపై హ్యూజ్ బజ్ ఏర్పడేలా చేశారు మేకర్స్. సినిమాలో బాలయ్య మాస్ విధ్వంసంతో రికార్డులచెడుగుడు ఆడేస్తాడని అంటున్నారు. సం యుక్త మీనన్, ప్రగ్యా జైశ్వాల్ హీరోయిన్స్ గా నటిస్తున్న అఖండ 2 కి మరోసారి థమన్ తన మాస్ డ్యూటీ చేస్తున్నాడట. అఖండ 2 సినిమాను దసరాకి రిలీజ్ ఫిక్స్ అనుకున్నారు. కానీ సినిమా పాన్ ఇండియా వైడ్ రిలీజ్ చేసే క్రమంలో వి.ఎఫ్.ఎక్స్ వర్క్ ఇంకాస్త బాగా చేయాలని ఆలోచిస్తున్నారట. అందుకే హర్రి బర్రి అన్నట్టు కాకుండా సినిమాను అనుకున్న విధంగా అవుట్ పుట్ వచ్చే వరకు చేయాలని చూస్తున్నారు. ఈ క్రమంలో అనుకున్న సెప్టెంబర్ 25 రిలీజ్ డేట్ కూడా మారే అవకాశాలు ఉన్నాయట. ఐతే అఫీషియల్ గా చిత్ర యూనిట్ ఆ విషయాన్ని అనౌన్స్ చేయలేదు. ఐతే దసరా కి అదే సెప్టెంబర్ 25కి ఆల్రెడీ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ సినిమా రిలీజ్ ఫిక్స్ చేశారు. ఓజీ సినిమాను సుజిత్ డైరెక్ట్ చేస్తున్నాడు. దానయ్య డివివి భారీ బడ్జెట్ తో ఈ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా కోసం పవర్ స్టార్ ఫ్యాన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు. రీసెంట్ గా జరిగిన వీరమల్లు ఈవెంట్ లో కూడా ఓజీఓజీ అనే కేకలు వేశారు. అఖండ2 వస్తుందో లేదోఅన్నది తెలియ దు కానీ ఓజీ మాత్రం తప్పనిసరిగా సెప్టెంబర్ 25 వచ్చి తీరుతుంది. అఖండ 2 రిలీజ్ డేట్ పై కన్ ఫ్యూజన్ ఇంకా కొనసాగుతూనే ఉంది. బోయపాటి శ్రీను ఈ సినిమా మీద స్పెషల్ ఫోకస్ తో పనిచేస్తు న్నారని తెలుస్తుంది.

రిలీజ్ డేట్ముఖ్యం కాదుసినిమా ఆడియన్స్ ని అలరించేలా చేయడం ముఖ్యం. అందుకే అఖండ2 రిలీజ్ పై ఇంకా స్పష్టత తీసుకోలేదు. ఒకవేళ అఖండ 2 దసరా రేసు నుంచి తప్పుకుంటే మాత్రం పవర్ స్టార్ ఓజీకి కలిసి వచ్చినట్టే. ఐతే దసరాకి అఖండ 2 మిస్ అయితే తమిళ సినిమాలు ఏవైనా వచ్చే ఛాన్స్ ఉంది.

# సినిమా..

## సమంత వేలికి కనిపించిన స్పెషల్ రింగ్..



స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రస్తుతం సినిమాల్లో బిజీగా లేకపోయినా, ఆమె గురించి నిత్యం ఏదో ఒక చర్చ నడుస్తూనే ఉంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే సమంత తరచూ తన లైఫ్‌కు సంబంధించిన అప్డేట్లు పంచుకుంటూ ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉంటుంది. అయితే ఆమె దర్శకుడు రాజ్ నిడమోరు తో రిలేషన్‌షిప్‌లో ఉన్నట్టు కొన్నాళ్లుగా నెట్టింట అనేక వార్తలు హల్‌చల్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇద్దరూ ఇటీవల అమెరికా వెకేషన్‌కు కలిసి వెళ్లినట్టు వార్తలు వచ్చాయి. అలాగే ఇటీవల ఒకే కారులో వీరిద్దరూ కనిపించడంతో ఇద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ నడుస్తుందనే ప్రచారం ఊపందుకుంది.

అయితే తాజాగా సమంత తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఓ ఫొటో ఈ వార్తలకు మరింత ఆజ్యం పోసింది. ఆ ఫొటోలో ఆమె ఒంటరిగా ఓ కేఫేలో బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ కనిపించింది. కానీ ఆ ఫొటోలో అసలు హైలైట్ ఆమె చేతి వేలిపై ఉన్న ఓ ప్రత్యేకమైన రింగ్. ఈ రింగ్ ఓవల్ షేప్‌లో ఉండగా, ఆ రింగ్‌పైన స్టోన్ చుట్టూ డైమండ్లు అలంకరించి ఉన్నాయి. డిజైన్ చక్కగా ఉండడంతో పాటు లైటింగ్‌లో మెరుస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. గతంలో ఎప్పుడు కూడా ఆమె చేతికి ఇలాంటి ప్రత్యేకమైన రింగ్ కనిపించలేదు. ఇది చూస్తే చాలామందికి ఒక డౌట్ వస్తుంది. ఈ రింగ్ రాజ్ నిడమోరు ఇచ్చిందా?

అనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఇది ఎంగేజ్‌మెంట్ రింగ్ అని కూడా కొందరు కామెంట్ చేస్తున్నారు. రాజ్–డీకే డైరెక్ట్ చేసిన ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 2, సిటాడెల్: హనీ బన్నీ వంటి వెబ్‌సిరీస్‌లలో సమంత ప్రధాన పాత్ర పోషించిన విషయం తెలిసిందే. అప్పుడు నుంచే రాజ్‌తో ఆమె స్నేహం మొదలై, ఆ సంబంధం నెమ్మదిగా ప్రేమగా మారిందన్న వార్తలు వెలుగులోకి వచ్చాయి.

# అతనికి ఇంప్రెస్ అయిన నయన్..!



కోలీవుడ్ స్టార్ హీరోయిన్ నయనతార ఆఫ్టర్ లాంగ్ టైం తెలుగులో మెగా మూవీకి సైన్ చేసింది. మెగాస్టార్ చిరంజీవి 157 సినిమాలో చిరంజీవి సరసన నటిస్తుంది నయనతార. ఆల్రెడీ ఈ ఇద్దరు సైరా నరసింహారెడ్డి సినిమాలో కలిసి జత కట్టారు. ఆ తర్వాత మళ్లీ అనిల్ రావిపూడి సినిమాకు పనిచేస్తున్నారు. ఐతే పెళ్లి తర్వాత నయనతార చాలా సెలెక్టెడ్ గా సినిమాలు చేస్తుంది. ఇతర భాషల సినిమాలైతే మాక్సిమం కాదనేస్తుంది. కానీ చిరుతో సినిమా అది కూడా అనిల్ డైరెక్షన్ లో అనేసరికి ఆసక్తి చూపించింది. అనిల్ రావిపూడి సినిమా షూటింగ్ ఎంట్రీ తోనే నయనతార ఒక క్రేజీ వీడియోతో హాయ్ చెప్పింది. ఇక సినిమాలో ఆమె రోల్ కూడా క్రేజీగా ఉండబోతుందని తెలుస్తుంది. సినిమాలో చిరంజీవి పి.ఈ.టి మాస్టర్ గా కనిపిస్తాడట. నయన్ పాత్ర గురించి డీటైల్స్ బయటకు రాలేదు. ఐతే అనిల్ వర్కింగ్ స్టైల్ కి నయనతార ఫిదా అయ్యిందని టాక్. ఎందుకంటే అసలేమాత్రం మిస్ యూజ్ లేకుండా స్టార్ డేట్స్ ని వాడుతున్నాడట అనిల్ రావిపూడి. అందుకే నయనతారకి కూడా అతను బాగా నచ్చేశాడట. అనిల్ రావిపూడితో పనిచేసిన ఎవరైనా ఈ మాటే చెబుతారు. నయనతార తెలుగు సినిమా చేయాలనుకోవడమే షాకింగ్ థింగ్ అయితే.. సినిమా అనుకున్న విధంగా చక చకా కానివ్వడం చూసి ఆమె సర్ ప్రైజ్ అవుతుందట. స్టార్స్ ని డేట్స్ అడిగి.. దానికి ఒకటి రెండు రోజులు అదనంగా తీసుకునే డైరెక్టర్స్ ని చూశాం కానీ అనిల్ ఇచ్చిన స్టార్ డేట్స్ కి రెండు రోజుల ముందే షెడ్యూల్ పూర్తి చేస్తాడట. అందుకే అతని గురించి అందరు పాజిటివ్ గా చెప్పుకుంటున్నారు. నయనతార కూడా ఇంప్రెస్ అయ్యింది అంటే ఆమెను మళ్లీ మళ్లీ తన సినిమాల్లో తీసుకునే ఛాన్స్ ఉంటుంది.

## వీరమల్లు గాయాలని ఓజీ తుడిచేస్తుందా..



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రాజకీయాలలో బిజీగా ఉండడంతో ఆయన సినిమాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం లేదు. బ్రో చిత్రం తర్వాత మళ్లీ హరిహర వీరమల్లు చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఈ సినిమా భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది. చిత్రానికి భారీ ఎత్తున ప్రమోషన్స్ చేపట్టారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ఈ సినిమా కోసం పలు ఇంటర్వ్యూలు ఇచ్చాడు. ప్రీ రిలీజ్ ఈవెంట్స్ లో సందడి చేశాడు. అయిన మూవీ రిలీజ్ అయ్యాక చిత్రం నిరాశ కలిగించింది. వీఎఫ్ఎక్స్ లో చేసిన మార్పులు కూడా సినిమాను నిలబెట్టలేకపోయాయి. ఫ్లాప్ టాక్ నుంచి బయటపడటానికి పవన్ కెరీర్‌లో మరో రీఎంట్రీలా ఓజీ కనిపిస్తోంది. ఓజీ – పవన్ కళ్యాణ్ మోస్ట్ అవైటెడ్ మూవీ ఎట్టకేలకు రంగంలోకి దిగుతోంది. మొదటి నుంచీ భారీ అంచనాల మధ్య దూసుకెళ్తున్న ఈ చిత్రం ప్రమోషన్స్ ఆగస్ట్ 2 నుండి మొదలు కానున్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ తమన్ కంపోజ్ చేసిన తొలి సింగిల్ అదే టైటిల్ సాంగ్ కావడం విశేషం. ఈ పాటకు ప్రత్యేకమైన హైపే ఉంది. 'ఖుషి'లోని "ఏ మేరా జహా" పాటలా ఇందులో ఇంగ్లిష్ లిరిక్స్ కూడా మిక్స్ చేసినట్టు సమాచారం. గతంలో 'తమ్ముడు'లో రమణ గోగుల కంపోజ్ చేసిన "లుక్ అట్ మై ఫేస్ ఇన్ ద మిర్రర్" తరహాలో ఓ మోడర్న్ వైబ్ అందించనున్నారని తాజా లీక్స్ చెబుతున్నాయి. సంగీతం, లిరిక్స్ నెక్స్ట్ స్టేజ్‌లో ఉంటాయని టాక్. ఇక హరిహర వీరమల్లు వల్ల నిరాశ చెందిన పవన్ ఫ్యాన్స్ ఓజీపై మరింత ఆశలు పెట్టుకున్నారు. ఊహించిన ఫలితం హరిహర వీరమల్లుతో రాలేదన్న భాద వారిలో ఉంది. అయితే సెప్టెంబర్ 25న ఓజీ సినిమా థియేటర్లలోకి రావడం ఖాయమని డివివి ఎంటర్టైన్‌మెంట్స్ ఇప్పటికే స్పష్టం చేసింది. ఏ పరిస్థితిలోనూ వెనక్కు తగ్గమన్న సంకేతాలు కూడా ఇస్తుంది. ఈ సినిమా ఫ్యాన్స్ జోష్‌ని తప్పక పెంచుతుందని అంటున్నారు . ఇప్పటికే చాలా ఏరియాల్లో ఓజీ డిస్ట్రిబ్యూషన్ హక్కుల కోసం టాప్ బయ్యర్లు పోటీ పడుతుండగా, ఇంకా కొన్ని ప్రాంతాల్లో దానయ్య నిర్ణయం తీసుకోలేదట. సాంగ్ రిలీజ్ తర్వాత మార్కెట్ ట్రెండ్ బట్టి నిర్ణయం తీసుకోవాలన్నది ఆయన స్ట్రాటజీ. రిలీజ్ కి ఇంకా 54 రోజులు మాత్రమే ఉండటంతో డివివి టీమ్ ప్రమోషన్లతో సోషల్ మీడియాను ఊపేస్తూ, హైప్ పెంచే పనిలో బిజీగా మారనుంది.

# ఎంత హైటున్న హీరో అయినా ఒకే!



టాలీవుడ్ కి పరిచయమైన యంగ్ బ్యూటీ ఇవానా గురించి చెప్పాల్సిన పనిలేదు. తొలి సినిమాతోనే అమ్మడు యువత అటెన్షన్ డ్రా చేసింది. యూత్ ఫుల్ లవ్ స్టోరీ తో కుర్ర కారులో క్రేజీ బ్యూటీగా మారిపోయింది. వైవిధ్యమైన హావభావాలతో ప్రేక్షకులకు దగ్గరైంది. ఇటీవలే సింగిల్ తో తెలుగులోనూ లాంచ్ అయింది. ఈ సినిమా కూడా మంచి విజయం సాధించింది. కేతిక పాత్ర కంటే ఇవానా పాత్రకే మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాగే త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో ఓ ఛాన్స్ అందు కుందనే ప్రచారం జరుగుతోంది. సక్సెస్ పరంగా ఇవానా ట్రాక్ బాగుంది. కోలీవుడ్ తో పాటు టాలీవుడ్ లోనూ పాజిటివ్ గానే కనిపి స్తుంది. యూత్ లోనూ క్రేజీ బ్యూటీగా వైరల్ అవుతోంది. -సింగిల్- తర్వాత తెలుగులో ఫాలోయింగ్ రెట్టింపు అయింది. ఇక ఇవానా వయసు విషయానికి వస్తే అమ్మడికి 25 ఏళ్లు. అంటే స్టార్ హీరోలందరితో నటించే వయసే. 20 ఏళ్ల నటే 50-40 ఏళ్ల వయసున్న హీరోలతో రొమాన్స్ చేస్తున్నారు. కాబట్టి ఇవానికి వయసు అడ్డండి కాదు.

## జాతీయ అవార్డ్ గ్రహీతలకి శుభాకాంక్షలు తెలియజేసిన చిరు..



తెలుగు సినిమాలు సత్తా చాటాయి. తాజాగా 71వ జాతీయ చలనచిత్ర అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించగా, ఏడు కేటగిరీల్లో తెలుగు సినిమాకు అవార్డులు వరించాయి. బాలకృష్ణ కథానాయకుడిగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'భగవంత్ కేసరి' చిత్రం 'ఉత్తమ ప్రాంతీయ తెలుగు చలనచిత్రం' అవార్డును గెలుచుకుంది. అలాగే ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన మైథలాజికల్ సోషియో ఫాంటసీ 'హను-మాన్'.. ఉత్తమ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగం లో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. 'బేబీ'కి బెస్ట్ స్క్రీన్‌ప్లే, బెస్ట్ సింగింగ్ అవార్డులు దక్కాయి. ఉత్తమ బాలనటి కేటగిరిలో 'గాంధీతాత చెట్టు' సినిమా నుంచి సుకృతివేణి అవార్డుకు ఎంపికైంది. తెలుగు చిత్రాలు సత్తా చాటిన నేపథ్యంలో పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwambhara.daily@gmail.com